# బాపురెడ్డి గేయాలు

జె. బాపురెడ్డి

894.8271
BAP

షేలా ప్రచురణ
హైదరాబాదు

A0UA101B104

# బాపురెడ్డి గేయాలు

జె. బాపురెడ్డి

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10868

V.R NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.
10868

సుఖేలా ప్రచురణ
హైదరాబాదు

మొదటి ముద్రణ
జనవరి 1968

రెండవ ముద్రణ
జూలై 1970

ముద్రణ :
లలితా ప్రెస్
హైదరాబాదు-4.

b

894.8271
BAP

వెల : 5/—

హక్కులు రచయితవి

A. V. R. NARLA MEMORIAL LIBRARY
P.R.L.
Acc. No.

ప్రతులకు :

సుశీలా నికేతన్
1. C. 85. ఇర్రంమంజిల్ కాలనీ
హైదరాబాదు-4.

A0uA101B104

i

# విషయ సూచిక


| | | | పుటసంఖ్య |
|---|---|---|---|
| (I) | ఆత్మస్తుతి | ... | I |
| (II) | మా మాట | ... | VI |
| (III) | స్వవిషయం | ... | X |
| (IV) | కావ్యకళ్యాణం | ... | XII |
| (V) | కావ్యస్వీకారం | ... | XVI |
| 1. | అమృతగళం | ... | 1 |
| 2. | నీవూ — నేనూ | ... | 3 |
| 3. | విపద్గీతి | ... | 5 |
| 4. | ప్రియాలాపం | ... | 7 |
| 5. | మహానుభూతి | ... | 9 |
| 6. | ఎవరి కోసం | ... | 12 |
| 7. | నిరుపమాన | ... | 13 |
| 8. | భవిష్యద్దర్శనం | ... | 14 |
| 9. | మార్గదర్శి గురజాడ | ... | 17 |
| 10. | మధ్య — భేదము | ... | 20 |

| | | | |
|---|---|---|---|
| 11. | నా పాట | ... | 22 |
| 12. | అయిదు అయిదడుగులు | ... | 23 |
| 13. | జవహారులాలు | ... | 26 |
| 14. | పొదుపు పిలుపు | ... | 29 |
| 15. | అజేయుడు | ... | 31 |
| 16. | లాల్ బహదూర్ | ... | 33 |
| 17. | ఎగసిపోయే హృదయం | ... | 36 |
| 18. | ఈప్స | ... | 38 |
| 19. | అనునయం | ... | 40 |
| 20. | అలారం | ... | 41 |
| 21. | ఏకధార | ... | 43 |
| 22. | పాండేరు పాట | ... | 45 |
| 23. | హేతుగీతి | ... | 47 |
| 24. | అరకులో అభ్యుదయం | ... | 48 |
| 25. | కృష్ణవేణి | ... | 52 |
| 26. | అదృష్టదేవత | ... | 56 |
| 27. | చిరంజీవులు | .. | 58 |
| 28. | మా తార | ... | 60 |
| 29. | ఆశయ విహంగం | ... | 64 |
| 30. | ఆకాంక్ష | ... | 66 |

III


| | | | |
|---|---|---|---|
| 31. | మహోద్యమం | ... | 69 |
| 32. | లో చూపు | ... | 73 |
| 33. | క్షుభితాత్మ | ... | 75 |
| 34. | జీవన రాగం | ... | 78 |
| 35. | అమ్లాన సిమ్లా | ... | 80 |
| 36. | ఇరవై పళ్ళు నిండె | ... | 82 |
| 37. | ప్రగతి గీతి | ... | 86 |
| 38. | సందేహ వీచి | ... | 89 |
| 39. | పరిణామం | ... | 90 |
| 40. | సిమ్లాలో చిన్నది | ... | 92 |
| 41. | ఆహ్వానం | ... | 94 |
| 42. | దాసోహం | ... | 96 |
| 43. | దీప గీతి | ... | 98 |
| 44. | విజయ శంఖం | ... | 100 |
| 45. | హిమ పాతం | ... | 105 |
| 46. | కల గాదది నిజము | ... | 107 |
| 47. | ఎన్నెన్ని అందాలు | ... | 109 |
| 48. | నెదరు లాండ్సు | ... | 111 |
| 49. | పత్రము — చిత్రము | ... | 114 |
| 50. | నడిరాత్రి — సుమగాత్రి | ... | 115 |

| | | | |
|---|---|---|---|
| 51. | నరుడో నారాయణుడో | ... | 116 |
| 52. | పూల ప్రస్థానం | ... | 119 |
| 53. | పూల కడలి | ... | 121 |
| 54. | నదీ నదీ రైను నదీ | ... | 123 |
| 55. | పంచేంద్రియ సుఖం | ... | 125 |
| 56. | మర్ మేడ్ | ... | 127 |
| 57. | బాపు | ... | 129 |
| 58. | కూలివాడు కుబేరుడు | ... | 130 |
| 59. | మహబూబ్ నగరం | ... | 132 |
| 60. | బంజరు భూములు పంచారు | ... | 134 |
| 61. | పాలమూరు పనివాళ్ళం | ... | 136 |
| 62. | భిన్నత్వం | ... | 138 |
| 63. | కన్నీళ్ళు | ... | 140 |
| 64. | చరిత్ర చర్వణం | ... | 141 |
| 65. | భావాలు | .... | 143 |
| 66. | ఏకతా సేతువు | ... | 145 |
| 67. | అద్వైతం | ... | 148 |
| 68. | చుక్కల్లో ఉపశ్రీ | ... | 149 |
| 69. | ఆరని వెలుగు | ... | 150 |
| 70. | పరమాత్మలో ఆత్మ | ... | 153 |

# ఆత్మశ్రుతి

పసి యెండలో మిసమిసలాడుతూ
పరవళ్లు తొక్కే సెలయేరును చూశారా ?
పసిమి వెన్నెల్లో కొసరికొసరి దృశాంచలాలు
విసిరే కలువరేకుల్ని చూశారా ?
చూస్తే సరి. చూడకుంటే ఇటు చూడండి.
ఆ సెలయేటి రూపు
ఆ కలువపూల చూపు
వెరసి చిరంజీవి బాపు (రెడ్డి)
వ్యక్తిగా బాపురెడ్డి మూర్తి ఇది.

## II

మరి—కవితా శక్తిగా అతని కీర్తి ఎలాంటిది ?

అది జారక దశను దాటింది.

కోరక దశను మీటింది.

ప్రసూన దశలో పదం మోపింది.

ఇది అతని మూడో కవితా సంపుటి.

మొదటిది 'చైతన్య రేఖలు'

రెండోది 'రాకెట్టు రాయబారం.'

కవి పేరే ఈ కృతి పేరు.

దీంట్లోని పికరుతులు ఒక కొమ్మవి కావు

వేరు వేరు.

అయినా అన్నిటిలో అనుస్యూతంగా ఉన్నది

ఒకే కాకలి.

కవిత్వపుటాకలి.

ఈ సంపుటిలో ఉన్న ఖండికలు భిన్నభిన్నమైనవి.

అలవోకగా వ్రాసినవి

ఆకాశవాణికి శ్రుతిచేసినవి

పత్రికలకోసం చెప్పినవి

మిత్రులకోసం గుప్పినవి

ఉద్యోగరీత్యా పలికినవి

హృద్యోగరీత్యా చిలికినవి

ఎన్నెన్నో భావమధు ధారలు కలిపి

ఏకమైన కలశి,

## III

### 2

బాపురెడ్డి అచ్చంగా కవి.
కవీతర పదవుల్ని (సాహిత్యరంగంలో) ఆక్రమించి
తాను గజిబిజిపడి
పాఠకుల్ని గడబిడ పెట్టే
　　కవిపండితుడూ కాడు
　　పండితకవీ కాడు.
చూసిన ప్రతి వస్తువునూ
కల్పనా చక్షువులతో పరికించి చూడగల
భావనా రసనతో చవిచూడగల
గుప్త సత్యాలకు లిప్తలో తెరతీయగల
తెరవెడలిన రసార్త భావాలకు
శబ్ద శాద్వలాలు పరిచేయగల
　　మౌలిక ప్రతిభ ఉన్నవాడు.
సమకాలీన కవుల ప్రభావం కుత్తుకబంటిగ ఉన్నా
గమ్మత్తుగా తప్పించుకుని
ఆ మహా ప్రవాహాన్ని ఉత్తరించి బయటపడే
నేర్పూ, అందుకు తగిన కూర్పూ ఉన్నవాడు.
　　చల్లకు వచ్చి ముంత దాచడ మెందుకు?
　　చూడండి 'నీవూ—నేనూ'.

### 3

"నీవూ—నేనూ"
　　"నీ కన్నుల వెలుతురులో
　　నే కన్నులు తెరిచాను.
　　కనులు తెరిచి నేనిది భూ
　　లోకమనే మరిచాను."

## IV

ప్రేయసి కనుల వెలుగులో ప్రియుని కనులు తెరుచుకున్నవి.

తెరుచుకున్న కనులు అలాగే ఉండిపోయినవి.

అతడున్నది భువిలో.

అందుకు పర్యవసానం ?

నిమిషంలో కళ్ళు మూతపడాలి.

కాని అలా జరగలేదు.

ఆ కళ్ళు అలాగే విస్ఫారితంగా ఉండిపోయినవి

అంటే అతడు అనిమిషుడైనా డన్నమాట.

'అనిమిష' పదం ఉచ్చరించకుండా ఆ వ్యంగ్యార్థం

భాసించే మాటలకు ఈ చరణం ఆభరణం.

"నీ పెదవులు కరచినాను
నను నేనే మరచినాను
మరచి ఇంద్రలోక సుధా
మాధురిలో నిలచినాను."

'అధరం సుధా మధురం' అని చెప్పలేదు కవి.

కాని చెప్పినంత పని చేశాడు భంగ్యంతరంగా.

(అయితే కరవడం దాకా వ్యవహారం జరగడం
కవి కరకు వయసుకు చెరగని చిహ్నం.
అది విషయాంతర మనుకోండి.)

"నీ నడుమును చుట్టినాను
నింగికొనలు ముట్టినాను
ప్రణయ కళాసీమ లేలి
పంచాస్త్రుని కొట్టినాను."

ఈ పంక్తుల్లో ఉన్న వ్యంగ్య వైభవం

పరిణత కవులతో కేలు కలిపేది.

ఆమె నడుమును చుట్టితే
ఆకాశం ముట్టినట్లయిందట.

# V

ఈ ఊహ ఎంత ఎత్తయిందో అంత లోతయింది.
ఆకాశాన్ని తాకడంలోని యెత్తు
అత్యంత పారవశ్యానికి గుర్తు.
అంతే కాదు—-

ఆకాశం శూన్యం.
ఆమె నడుము అంతకటె శూన్యం.

('నడుమే పసలేదుగాని నారీ మణికిన్' అని ఊరికే అన్నాడా
ప్రబంధకవి)

ఆమె నడుమును చుట్టివేయడమంటే
ఆకాశాంచలాల్ని ముట్టివేయడమే కదా!

అందుకే అన్నాను ఈ ఊహ ఎంత ఎత్తయిందో
అంత లోతయిందీ అని.

ఈగీతంలో ఉన్నవి అయిదే అయిదు చరణాలు.
ఇవి అయిదు చరణాలు కాదు
అనంగుని అయిదు శరాలు.
తలచినకొద్దీ పులకలు
వలపు జంటలకు మెయిములకలు.

ఇంతటితో 'ఆత్మశ్రుతి' ముగుస్తున్నది,
ఇన్ని గేయాల్లో ఒక్క గీతానికే
శ్రుతి చేసి మిన్నకుంటున్నాను.
ఇందుకు ఒకే ఒక్క హేతు వుంది.

బాపురెడ్డికీ నాకూ ఉన్న అనుబంధం ఎలాటిదంటే
అతణ్ని గురించి ఇంక ఏమాత్రం విస్తరించినా
ఈ ఆత్మశ్రుతి ఆత్మస్తుతిగా పర్యవసిస్తుందేమో?

బాపురెడ్డి మిగతా గేయాల్లోని
తీపిని ఆస్వాదించే మధువ్రతులకు స్వాగతం.
సెలవు.

సి. నారాయణరెడ్డి

# మా మాట

## ( మొదటి ముద్రణకు )

భూత కాలము పెరిగి నట్టా?
భావి కాలము తరిగి నట్టా?
నూత నాబ్దో దయము నీ అను
భూతిలో ఏ గతి రహించు నో?
ఓ స్వరాట్ కవి సమ్రాట్—కొను
మోయి నా ఈ శుభా కాంక్షలు!
నీ కళా క్షేత్రమున పండును
గాక నవ్యాక్షర ద్రాక్షలు!

1968 నూత్న వర్షోదయ శుభక్షణంలో. నెదర్లాండ్సు (ఐరోపా) నుంచి, బాపురెడ్డి గారు ఇక్కడ భీమన్న గారికి పంపిన ఆకాంక్షా గేయ మంజరి ఇది. ఈ ఒక్క మంజరీ చాలు బాపురెడ్డి గారి కవితా సామ్రాజ్య విస్తరాన్ని వివరించడానికి.

తాను స్వరాట్ అయిన వాడే మరొకరిని సమ్రాట్ చేయ గలడు. బాపురెడ్డి గారు కవితా స్వరాట్. ఆ విషయాన్ని ఆధునిక కవితా మహా ప్రభువైన డాక్టరు సి. నారాయణరెడ్డి గారు తమ ఆత్మశ్రుతిలో నిరూపించారు.

అడిగిన వెంటనే! అవ్యవధిగా, నిమిషాల మీద ఈ కృతికి ఆత్మశ్రుతి సమకూర్చి ఇచ్చిన నారాయణరెడ్డి గారికి మేం చాల కృతజ్ఞులం. పీఠికలో, పరిచయాలో వ్రాయడానికి అంగీకరించి, కవుల్ని నెలల తరబడి ఇండ్ల చుట్టూ తిప్పుకొనె మహానుభావులెందరో ఉన్నారు. అట్టి వారందరికీ నారాయణ రెడ్డిగారు వెలుగు బాట చూపించారు ఈ రంగంలో కూడ.

బాపురెడ్డి గారు కవి. కవి అంటే వైదికార్థం పరబ్రహ్మ. మూల సృష్టి చెయ్యగలిగిన వాడే పరబ్రహ్మ. కవితా రంగంలో మూల సృష్టి చెయ్యగలిగిన వాడే కవి. ఆనంద రసార్ణవం నుంచి కొత్త కాలువలు తీసి, కొత్త పంటలు పండించే వాడే కవి. కవిత క్షేత్రజ. భూజాత. సీత. కవిజనకుడు. అందుకే కాబోలు–తన కవితా సీతను కృతిఇస్తూ, భీమన్న గారిలో కోదండ రాముణ్ని చూచుకొన్నారు బాపురెడ్డి గారు.

కవిత ప్రతిభా క్షేత్రజ. పాండిత్య కర్మాగారాలలో తయారయ్యే విలాస వస్తు సామగ్రి కవిత కాదు. అనువాదాలు, నినాదాలు, నీతులు, నిష్ఠలు, మాటల ట్రిక్కులు, ప్రాసల ఫీట్లు, పిచ్చి తిట్లు తప్ప మూల సాహిత్యం మృగ్యమైన తెలుగులో బాపురెడ్డి గారి వంటి యువకులు సాహితీ సృష్టికి పూనుకోవడం ఎడారిలోకి గంగా తరంగిణి ప్రవహించడం. అది ఒక సుజలాం, సుఫలాం, సస్యశ్యామలాం కావాలని మా ఆకాంక్ష.

మహా కావ్యాల రోజులు కావివి. కావ్యాలు, ప్రబంధాలు, మహా కావ్యాలు గత కాలపు చిహ్నాలు. ఇంత వరకూ ఉన్నవి చాలు. వాటి

నమూనాలో క్రొత్తవి అక్కరలేదు. ఇప్పుడు మనకు కావలసినవి వినూత్న వేదాలు. సన్మానాలను, సభా మర్యాదలను, ప్రైజులను, పండిత ప్రశంసలను, డబ్బును, డాబుసరితనాన్ని ఆశించి వ్రాసే గ్రంథాలు సాహిత్యం కాదు. ఇప్పుడు మన సారస్వత రంగంలో ప్రబలంగా ఉంటున్నది ఉబ్బే కాని, బలుపు కాదు. ఇది యువ రచయితలు గుర్తించ వలసిన పరమ సత్యం.

ఇప్పుడు మనకు కానలసినవి వినూత్న వేదాలు. బాపురెడ్డి కవి. ఆయన పలికే ప్రతి వాక్కూ ఒక ఋక్కు. దేశకాల పాత్రానుగుణంగా ప్రవహించి వస్తున్న గంగా తరంగిణి ఆయన కవిత. సనాతన మహా సరస్వతి ఆయన నుంచి మళ్ళీ వ్యక్తీభూత అవుతున్నదా అనిపిస్తుంది—ఆయన ధోరణి గమనిస్తే.

ఈ కృతి బోయి భీమన్న గారికి అంకితం. కృతికర్త, కృతిభర్త ఇద్దరూ ధన్యులు. ఇద్దరూ కవులు. ఒక కవి కృతి ఒక కవికి శ్రుతి. ఇద్దరూ కవులు. ఇద్దరిపీ శ్రుతులు.

బాపురెడ్డిగారి ఈ గేయ కవితా శ్రుతిని ప్రకటించ గలుగుతున్నందుకు మేం ఎంతో ఆనందిస్తున్నాం. ఆయనకు చాల కృతజ్ఞులం.

ఉన్నత పరిశోధనా వ్యాసంగంలో, నెదర్లాండ్సు కేంద్రంగా, ఐరోపా పర్యటన జరుపుతున్న బాపురెడ్డి గారు అక్కడి నుంచి అంకిత గేయంతో పాటు ఇంకా కొన్ని అద్భుతమైన గేయాలు పంపించారు. వాటన్నిటినీ ఈ కృతి పునర్ముద్రణలో చేర్చగలం. అసలు, బాపురెడ్డి గారు అక్కడి నుంచి మిత్రులకు వ్రాస్తున్న లేఖలే ఒక ప్రత్యేక సాహిత్యం. వాటి మాట తర్వాత.

ఈ గ్రంథాన్ని అందంగా ముద్రించి ఇచ్చిన నాట్యకళ ప్రెస్ వారికి, ఈ విషయంలో మాకు తోడ్పడిన యావగిరిరెడ్డి, గిర్‌గ్లాని, జగ్గారెడ్డి, గిడుగు రామమూర్తి, చిత్రశిల్పి పి. ఆర్. రాజు, అరిపిరాల విశ్వంగార్లకు, తదితర మిత్రులకు మా నమస్సులు.

## (రెండవ ముద్రణకు)

బాపురెడ్డి గేయాలు మొదటి ముద్రణ ప్రతులు రెండు సంవత్సరాలకే ఖర్చై పోయినందుకు ఎంతో ఆనందిస్తున్నాం. తెలుగు ప్రజలు డిటెక్టివు, సెక్సు, నవలాసాహిత్యాలను మాత్రమే తప్ప శుద్ధ కవిత్వాన్ని కొని చదువరనేది కేవలం అపోహ మాత్రమే నని దీనివల్ల రుజువైంది. విమర్శలు, తిట్లు మాటల గారడీలు మాత్రమే కవిత్వమనుకుంటున్న నేటి అభ్యుదయ నామక రచయితలను త్రోసి రాజని శుద్ధమూ సృజనాత్మకమూ ప్రయోజనకరమూ అయిన కవితను వెలయిస్తున్న బాపురెడ్డికి ఇంతగా ప్రోత్సాహ మిచ్చిన తెలుగు ప్రజలకు సహృదయులకు మా కృతజ్ఞలు, అభివందనాలు.

ఈ గేయాలు మొదటి ముద్రణ జరిగినపుడు బాపురెడ్డి గారు విదేశాలలో ఉన్నారు. ఇప్పుడాయన స్వదేశంలోనే ఉన్నారు. తన విదేశ అనుభవాలను అనుభూతులను అనేకాలను గేయ రూపంలో సంతరించుకొన్న వాటిని ఈ రెండవ ముద్రణలో చేర్చడం జరిగింది. విదేశాల రసభావ సౌందర్యాలను తెలుగు చేసుకొని తెలుగు నుడికారపు సొంపులతో సొగసులతో తెలుగు ప్రజలకు అందివ్వడం అనే ఈ పద్ధతికి బహుశః బాపురెడ్డి గారే జనక స్థానీయులేమో. ఇంతవరకు ఈ పద్ధతిలో తెలుగుదనాన్ని విస్తరింప జేసిన కవి మరొకరు కనిపించరు.

కొత్తగా చేర్చబడ్డ ఈ గేయాలలో చాల భాగం అద్భుతమైనట్టివీ, అపూర్వమైనట్టివీ. వాటి స్వారస్యాన్ని చదువరులే గ్రహించగలరు. మొదటి ముద్రణ గేయాల వలెనే ఇవి కూడ ఆకాశవాణిలోను పాట కచ్చేరీలలోను బహుళ ప్రచార ప్రాచుర్యాలను అందుకో గలవని ఆశిస్తున్నాం.

ఈ ముద్రణకు తోడ్పడిన వారందరికి ముఖ్యంగా చిత్ర శిల్పి పి.ఆర్. రాజుగారికి, జె. జగ్గారెడ్డిగారికి, మడిపల్లి సుబ్బారావుగారికి, లలితా ప్రెస్ యజమానులు చర్ల గణపతిశాస్త్రిగారికి, మే మెంతో కృతజ్ఞులం.

సుఖేలా నికేతన్

# స్వవిషయం

ఈ పుస్తకం నేను 1967-68 లో నెదర్‌లాండ్స్ దేశంలో విజ్ఞాన యాత్రలో ఉన్నప్పుడు వెలువడింది. అందుకు సుఖేలా నికేతన్ వారి ఉత్సాహమూ సాహిత్యాభిమానమూ కారణం. రెండేళ్లైనా నిండకుండానే రెండవ ముద్రణ జరగడం నా అదృష్టం. ఈ కాలంలో కవితా గ్రంథాలు పునర్ముద్రణకు నోచుకోవటం చాల అరుదు. దూర తీరాలలో ఉండటంచేత ప్రథమ ముద్రణలో ఈ పుస్తకం గురించి నా మాట ఏదీ మనవి చేసుకోలేక పోయాను. అందుకే ఇప్పుడు స్వవిషయం కొంత ప్రస్తావిస్తున్నాను.

నా గేయాలను, గేయ నాటికలను, పద్య కావ్యాలను, గద్యకావ్యాలను మిశ్రమంగా కాక విడివిడిగా నాలుగు సంపుటాలుగా వేయాలన్న సంకల్పానికి ఈ పుస్తకం నాంది అయింది. తర్వాత 1969-70 లో 'పద్య కావ్యాలు', 'గేయ నాటికలు', 'గద్య కావ్యాలు' సుఖేలా నికేతన్ వారి నిర్విరామ కృషి ఫలితంగా వెలువడ్డాయి. ప్రతి సంపుటీ పునర్ముద్రణ జరిగినప్పుడు (పాఠకుల ఆదరణ ఉంటే) ఉత్తరోత్తర వ్రాసిన ఆయా ప్రక్రియాగతమైన కావ్య ఖండికలను ఆయా సంపుటిలో చేరుస్తూ ఉండాలనే ఉద్దేశ్యంతో నా కవితా సంపదను నాలుగు భాగాలుగా విభజించాను; నాలుగు దండలుగా అల్లుకున్నాను.

ఈ సంపుటి నా వినూత్న గేయమాలిక. ఇందులో ఇంతవరకు నా కవితోద్యానంలో విరిసిన సుందర గేయ ప్రసూనా లన్నిటినీ కూర్చడం జరిగింది. తొలి ముద్రణలోని 44 గేయాలతోపాటు 26 క్రొత్త గేయాలను చేర్చి రసజ్ఞులైన పాఠకులకు ప్రేమ పూర్వకంగా, గౌరవ పురస్సరంగా ఈ గేయస్రక్‌ను అందిస్తున్నాను. ఐరోపా యాత్రలో నేను పొందిన అనుభూతుల్ని కూడ ఇందులో పొందు పరిచాను. అందరి సమాదరణతో ఈ గ్రంథం ప్రవర్ధిత మౌతుందని ఆశిస్తున్నాను.

ఈ పుస్తకానికి "ఆత్మ శ్రుతి" కూర్చిన నవ్య గేయ మహాకవి డా॥ సి నారాయణరెడ్డి గారికి నే నెంతో కృతజ్ఞుణ్ని. ఆయన ఆశీరమృత వాక్కులు నాకు వెలుగు చూపిస్తుంటాయి. ఆయన అన్నట్లు ఈ గేయాలు విభిన్న చిత్త వృత్తులలో, వివిధ సందర్భాలలో వ్రాసినవి. అయితే అన్నింటిలో సౌందర్యారాధన, సమన్వయతాలోకన, ఆనందోపాసన, అభ్యుదయోన్మేషము అంతస్సూత్రంగా కన్పిస్తుంది. అనుభూతులకు అక్షరాకృతిగా వివిధఛందస్సులలో వ్రాసిన ఈ గేయాలన్నీ గాయనీ గాయకుల మధుర కంఠాలలో పొంగెత్తి పునీతం కావాలని కోరుకుంటున్నాను.

ప్రతిభా కోదండరాముడూ, కవితా కిరణ సోముడూ అయిన శ్రీ బోయి భీమన్న గారికి ఈ నా భావనా ప్రాజ్ఞజాతను కావ్య సీతను అంకితం చేయగల్గినందుకు గర్విస్తున్నాను. భీమన్న గారితో సాహితీ బాంధవ్యము స్వర్లోక సార్వభౌమత్వ ప్రతిమానము. మా మైత్రికి ఈ గ్రంథం కాంతి స్తంభంగా నిలువాలని ఆశిస్తున్నాను.

ఇందులోని గేయాలను చదివి, చదవగా విని నన్నెంతో ప్రోత్సహించిన సర్వశ్రీ దాశరథి, డా. దివాకర్ల వేంకటావధాని, దేవులపల్లి రామానుజరావు, శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, కె. వాసుదేవరావు I. A. S. జె. యం. గిర్‌గ్లాని, పి. వి. జి. కృష్ణమాచార్యులు, I. P. S, ఎన్. యాదగిరిరెడ్డి, అరిపిరాల విశ్వం జి. ఆర్. రెడ్డి, ఆర్. యం. శాస్త్రి, I. A. S, ముకురాల రాంరెడ్డి. జె జగ్గారెడి, పోతుకూచి సాంబశివరావు వంటి మిత్రులకు ఈ సందర్భంలో కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాను. నా కవితా వ్యాసంగానికి అనుదినం తోడ్పడే మత్కళత్రం శ్రీమతి రాజేశ్వరికి నే నెంతో ఋణపడిఉన్నాను. ఈసంపుటాన్ని సర్వాంగ సుందరంగా ప్రచురించిన సుఖేలా నికేతన్ వారికి నా హృదయ పూర్వకాభి వందనములు.

ఇట్లు

జె. బాపురెడ్డి

# కావ్య కళ్యాణం

నీవు వరుడ వగుటకు ఏ

దేవతలను కొలిచి నదో

నా యీ నవ కావ్య వధువు

ఓయి బోయి భీమన్నా ! ॥నీవు॥

## XIII

పాండిత్యము, రస తత్త్వము,
ప్రగతి సాహితీ సత్త్వము
ఆకృతి గొన్నట్టి అక్ష
రాకారా! సాకారా! ॥నీవు॥

గోదావరి తీరములో
గోపాలుడ వై పుట్టి,
ప్రకృతి దేవి ఒడిబడిలో
పంచాక్షరి వై నట్టి ॥నీవు॥

జ్ఞాన పదుల జాగృతికై
జాబులు పంపించితివి,
మధు బాలకు రాగోదయ
మధు గీతలు మప్పితివి ॥నీవు॥

పాలేరును ప్రభువు చేసి,
కూలీనే రాజు చేసి,
సభలుచేసి భావ దీప
విభవము చూపిన వాడా! ॥నీవు॥

# XIV

ఆరు ఋతువు లందలి ప్ర
హ్లాద రాగ మధువు తీసి
ఏడవ ఋతువును చేసి
ఏలిన రస లోకేంద్రా! ॥నీవు॥

ప్రబల భావనా రాకెటు
పై అనాది కొస నుండి
అనంత త్వ మెల్ల ప్రద
క్షిణ చేసిన రాగ ఋషీ! ॥నీవు॥

కొండలు, మానవ లోకపు
గుండెలు చైతన్య సుధా
భాండము లౌనట్లు కొండ
తాండవ మొనరించు నట్టి ॥నీవు॥

సకల తత్త్వ సారామృత
సంభరిత కళా కలశీ
వైతాళిక గాన రాగ
వైశాఖిని విరియించిన ॥నీవు॥

## XV

ఇది నా భావ తరంగిణి,
ఇది నా గేయోత్పలిని,
కల శోదధి కళా నిధీ!
కల్యాణము కమ్ము సుధీ! ॥నీవు॥

ప్రతిభా కోదండ రామ,
ప్రగతీద్ధ గదా భీమా!
భారతికై సర్వస్వము
ధార పోయు గుణధామా! ॥నీవు॥

మేలుకో మదను రాగ
శ్రీ విభాత శ్రుతి గీతను!
ఏలుకో మదను భూతి
క్ష్మా జాతను కృతి సీతను! ॥నీవు॥

బా పు రె డ్డి

# కావ్య స్వీకారం

పూర్వ జన్మము లోన ఏ యే
పుణ్యములు పండించి నానో,
దివ్యమౌ నీ సాహితీ బాం
ధవ్య మధువు లభించె నాకు!

పరిమళమ్ముల పసిడికడ్డీ!
బాపురే శ్రీ బాపురెడ్డీ!

సూర్య తీక్ష్ణము నీదు ప్రతిభ,
చంద్రలలితము నీదు గుండె,
నీదు సఖ్యము ప్రణయ ముఖ్యము,
నిత్య నవ సాహిత్య చైత్రీ

పారిజాతపు తోట నీది!
బాపురే ఓ బాపురెడ్డీ!

వాణి వీణా వాద కంకణ,
వేణు నాదా మోద కింకిణి,
నీ మనో భూజాత కవిత
నా మనోహరి యైన చరిత

పలుకు చెలి పల్కులకె జేజే!
బాపురే జే బాపురెడ్డీ!

బోయి భీమన్న

# 1. అమృతగళం

అబ్బా! ఎన్నాళ్ళకు నీ
అమృతగళము విననాయెను!
కోటి రాగ వీణ లోకే
మాటు మీటి నటులాయెను!

రిక్త సంధ్యలోన ఉష
శ్రీ లలాట రాగవల్లి
ఎడతెగని ఎడారిలోన
ఎక్కడిదీ పాలవెల్లి!

హృదయ మున్న నేమి, దాని
కదిలించు సమీర మేది ?
కన్ను లున్న నేమి, వాని
కరగించెడి దృశ్య మేది ?

ఇన్ని కళలు నేర్చియు నే
నింత గొప్ప కలము పూని
చిత్రించే దేమిటి ? ఈ
చీకటి గుయ్యారంలో !

నీవు నిజంగానే నను
నిదురనుండి లేపినావు !
కాదు, నిదుర లేని దివ్య
కాంతిపథము చూపినావు !

నీ సుహృ ద్వసంతమ్మున
లేవు భూత భవితమ్ములు,
నీ దరస్మిత జ్యోత్స్నల
లేవు జరామరణమ్ములు.

నీవు అనిర్వచనీయవు
కాని చిరస్మరణీయవు,
నేను ఇంతవరకు జడుడ
కాని ఇపుడు కవీశ్వరుడ.

# 2. నీవూ–నేనూ

నీ కన్నుల వెలుతురులో
నే కన్నులు తెరిచాను
కనులు తెరచి నే నిది భూ
లోకమనే మరిచాను.

నీ పెదవులు కరచినాను
నను నేనే మరచినాను
మరచి ఇంద్రలోక సుధా
మాధురిలో నిలచినాను.

నీ చెక్కిలి నొక్కినాను
నే హిమగిరు లెక్కినాను
గాలి ఈలవేయ శివుని
లీల నాట్య మాడినాను.

నీ నడుమును చుట్టినాను
నింగి కొనలు ముట్టినాను
ప్రణయ కళా సీమ లేలి
పంచాస్త్రిని కొట్టినాను.

నీ కౌగిలి చేరినాను
నే కన్నులు మోడ్చినాను
లోకమ్మున కోటి కోటి
నాకమ్ములు చూచినాను.

## 3· విపద్గీతి

నవ వసంతానివై
అవతరించెద వంచు
నా బ్రతుకు తోట ని
న్నాళ్లు పెంచితినే !
స్నేహానిలములతో
చిరునవ్వు విరులతో
విరహ శిశిరము నుండి
విడిపించు నను చెలీ !

ప్రేమ రసవృష్టి కురి
పింతువని ఆశించి
యౌవనీ ! నా తరుణ
యౌవన క్షేత్రాన
చల్లితిని మంజులా
శయ బీజముల నెన్నొ
ఈ ప్రవాసపు టనా
వృష్టి కడతేర్చవే !

విడిపోని నీ వలపు
బిగి కౌగిళుల కూర్చి
రస రాగ మధుర స్వ
ర్గము ప్రసాదింతువని

దేవతల కాదు, నా
దేవి నిను కొల్చితిని;
ఎడబాటు నరకాన
పడియుంటి విడిపించు !

నీ అందియల పాట
నీదు గాజుల మాట
విననెంచి మరి యేది
వినకుండ నీ మీదె
నిల్పితిని ధ్యానమ్ము
నీరవ స్థితి నుంటి
శ్రుతినించు సఖియ ! నా
శూన్య జీవితములో !

కల్పించి వ్రాసినది
కాదు ఈ కావ్యమ్ము
కాలిపోయెడి గుండె
జాలి మొరలే ప్రియా !
దళిత జీవిత విప
త్కాల గానము ప్రియా !
శరణాగతుడ నేను
కరుణించి రక్షించు !

## 4. ప్రియాలాపం

కటికనేల నడిచి నడిచి
కందిన నా పాదమ్ములు
ఎఱ్ఱ గులాబీ లై పోయెనురా!
ఎఱ్ఱ గులాబీ లై పోయెనురా!

ఈ యవ్వన భారమ్మును
మోయలేక నా నడుము
తరిగి తరిగి కరిగిపోయె కదరా!
తరిగి తరిగి కరిగిపోయె కదరా!

చీకట్లను చించి చీల్చి
నీ కోసం వెదకి వెదకి
నా కన్నులు కాటుక లై పోయెనురా!
నా కన్నులు కాటుక లై పోయెనురా!

నిన్నే మదినిల్పి చేయు
చున్న ప్రేమ తపసున నా
జడలు మడమలంట పెరిగిపోయెనురా!
జడలు మడమలంట పెరిగిపోయెనురా!

నా నిట్టూర్పుల వేడిమి
లోన మసలి మసలి నా
బుగ్గ లగ్గి బంతులై పోయెనురా!
బుగ్గ లగ్గి బంతులై పోయెనురా!

తాపముతో నీవు రాని
కోపముతో కొరుకుకొన్న
నా పెదవులు కుంకుమ పూలాయెనురా!
నా పెదవులు కుంకుమ పూలాయెనురా!

నా వలపులు నా తలపులు
నీ కొరకై వేచి వేచి
గుండెమీద గుడులు కట్టుకున్నవిరా!
నా గుండెమీద గుడులు కట్టుకున్నవిరా!

ఊహలతో ఊగి తూగి
ఉండలేక దొరలిన నా
తనువెల్లను వంపులు పడిపోయెనురా!
తనువెల్లను వంపులు పడిపోయెనురా!

# 5· మ హా ను భూ తి

ఎన్నొ ఊహాలను, ఎన్నెన్నొ అనుభూతులను
జీవ నిర్భర భావ చిత్రాల నిల్పునా
కలము నీ రూప సత్కళ జూచి తల వాల్చి
కంపించు తన గొంతు కదుపజాలదు దేవి!

ఎట్టు లాహోవనింతు ఎద బరువు తీర నిను !
మిన్నేరు నీ కాళ్ళమీద ప్రవహించునా
చంచలలు నిన్నె స్పృశించి నటియించునా
సింగిణులు నీ కొప్పుచేరి శోభించునా

అంగాంగమున సుధలు పొంగి పారగ నీదు
అధర పుష్పాన సంధ్యారుణిమ డాగెనా
యనిపించు, ఎడద భావనలేవొ వికసించు,
ఈ సృష్టి కర్థమ్ము ఈ నాటికి స్ఫురించు.

వాక్కులకు, ఊహలకు చిక్కవని నీ ముందు
విశ్వ సాహిత్యాలు విధిలేక తలవాల్చు.
ఇలలోని కళలు పువ్వుల దండలై వచ్చి
నీ గళము పూజించి నేడు ధన్యత నెందు.

శస్త్రాలు, సకల అణ్వస్త్రాలు, నీ చూపు
చలువలో మంచుగడ్డలుగా నిలిచిపోవె ?
పాపాలు నీ కంటి దీపాల వెల్గులో
తానమాడిన పుణ్య ధామమ్ములై పోవె ?

నీ అమృత భావ పుష్పాగత సముచ్ఛ్వాస
ముల మోసికొని గాడుపులు ధన్యములు కావె ?

స్వర్గ మన్నది ఉండి చచ్చినను నాకేమి
నిన్ను జూచిన కళ్ళు మన్ను జూచునె ఎందు ?

యుగయుగాలుగ మర్త్య జగతి గోళము తపసు
చేసి ఈనాటి కాశించినది కాంచినది
నీ లసత్పాద ముద్రలలో తరించినది
నీ దరస్మిత కాంతి భూషలు ధరించినది.

యౌవనీ ! సర్వ శాస్త్రార్థ పారమ్ము నీ
దరహాస మకరంద ధారలో కన్పించు,
శబ్దా లలంకార శాస్త్రాలు నీలోన
చూచుకొని తమను సరిచూచుకొని శోభించు.

కళలన్ని రంగురంగుల బావుటా ల్లేపి
సాహిత్యములు కావ్య సౌరభమ్ములు నింపి
సౌందర్యములు మహోజ్వల దీపములు పట్టి
ఆనందములు తోరణాలు ఆడగ కట్టి

నీ జీవితోత్సవ మిదే జరుపుచుండగా
నేను మైమరచి నాలోని కన్నులు తెరచి
దర్శింతు, హర్షమ్ము వర్షింతు, స్థిరమైన
కలవోలె నీ యశః కళవోలె జీవింతు.

# 6. ఎవరికోసం

ఎవరికోసం నేను
ఇల కవతరించానో ?
ఎవరికై ఈ బ్రతుకు
చివుకనీ కున్నానో ?

ఎవరికై కలలు రే
బవలు కంటున్నానో ?
ఎవరికై ప్రతిది పా
టే అల్లి పాడుదునో ?

ఎవరికై దశ దిశల
కెగసి చూస్తున్నానో ?
ఎవరికై వెర్రినై
ఇరులు త్రాగెదనో ?

నా కోసమైతె కా
నే కాదు దేవీ !
ఓ కాంతి గర్భ ప్రా
గా కాశ భావి !

# 7· నిరుపమాన

ఏ మంచు పేరిడుదునో నీకు చెలియా !
ఏ మంజు గీతాల నిను కూర్తునే ప్రియా !
నీ ముందు తన మందహాసాల రుచి మాయ
ఆ సరోజిని ముఖము ముకుళించెనే !

నీ నుదుటి ప్రణయ కుంకుమ కాంతులను జూచి
సిగ్గిల్లి తారమ్మ కారుమబ్బుల దూరె !
నీ కుంతల వినీల కాంతితరగల జూచి
ఆ సునంద మిళింద బాల ముసుగు బిగించె !

ఆ వీణ నీ గానమున మ్రోగలేక
సాగి తీగెలు తెగగ మూగవడిపోయె !
పతిలేని మతిలేని రతిరాణి నిను జూచి
"బ్రతుకేల నాకు" అని చితి కూర్చుకొన జూచె !

లక్ష్మి సరస్వతి ఉషస్విని సత్కళల
మిళితమున సుదినమున సృజియింపబడినావో ?
ప్రకృతి హస్తాలతో చంచలా డోలలో
మైమరచి మన మూగు చుందమే,
యుగయుగాలుగ వెలుగు చుందమే.

# 8· భవిష్యద్దర్శనం

ఈ జగత్పరిణామ గతి ఎం
తెంత వడిగా సాగుచున్నది !
మానవుని జీవిత పథమ్ములు
మాటిమాటికి మారుచున్నవి !

మానవుని జిజ్ఞాస కాంతి మ
హానదీ డోలికల తేలును,
యుగ యుగమ్ములు గడిచి రాతి
యుగము రాకెటు యుగము చేరెను.

ఒక శతాబ్దానంతర నరుం
డూహ వలె నా కనుల మెరయును,
తన వినూత్న విచిత్ర జీవిత
మును క్షణము కన్పరచి పోవును.

అతడు విజ్ఞానంపు టంచుల
నధిగమించుచు నుండెనో యన
అంతరిక్ష దిశాంతముల మెరు
పై చరించును విజృంభించును.

చంద్రబింబ సుధాంకమున తా
చకోరమ్మై చేరి కూర్చొని
విమల పద్మమువలె ఇలా గో
ళమును గని హర్షించి మించును.

దేశముల విభజించు ఎల్లలు
మాసిపోవును అతని చూపుల,
మానవుని బాధించు స్వార్థో
న్మాదములు నశియించు నా యెద.

వానరుడు దానవుడు నగు మన
మానవుడె సురుడుగా కన్పడు,
అతని దృష్టికి తిండి గుడ్డలు
అల్ప విషయమ్ములుగ కన్పడు.

సర్వ మండలములను తన వా
సమ్ము చేయు ప్రయత్న మతనిది
సృష్టి మూల రహస్యమును గను
దృష్టి చేకొను యత్న మతనిది.

లేమి యే అతనికి ఉన్నటు
లేదు లే దింకొకరి బలిమి,
గడియ కృషి చేసిననె అతడు
పడయు వలసినయంత కలిమి.

క్రాంతికై అతడు తపించు
శాంతి సుఖముగ ధరవసించు
మనకు అతనికి ఎంత భేదము
కనుపడు నోహో ! కాలమహిమ !

అదిగొ ఇరువది యొక శతాబ్ద
మ్మందు మనిషి మహానుభావుడు !
చూడు మాతని బ్రతుకు ఎంతటి
సుందరమ్మో, ప్రచలితమ్మో !

17

## 9. మార్గదర్శి గురజాడ

నూరు వత్సరములకు పూర్వము
భారతీ జీవితకళా సం
జీవిగా, గురజాడ అప్పా
రాయ ! వెలసితివి !

పుట్టగానే పరిమళించిన
పూవువై, సాహిత్యసుగతిని
నిత్యనూతన సౌరభమ్ముల
నింపి పోయితివి !

దేశమంటే మట్టి యనుకొని
మోసపోయిన భరతజాతికి
దేశమంటే మనుషులని సం
దేశ మిచ్చితివి !

ఆడబిడ్డల అమ్ముకొను సం
ఘమ్మునకు తగు బుద్ధి చెప్పగ
సృష్టి చేసితివయ్య "కన్యా
శుల్క" నాటకము

ఛాందసముపై గ్రాంథికముపై
సాంఘిక దురాచారములపై
కత్తిగట్టి తెలుంగు జాతికి
ఖ్యాతి గూర్చితివి !

వేషభాషలు మార్చి మోసము
చేసి బ్రతికే స్వార్థపరులు
న్నంత కాలము మరువగలమా
నీ గిరీశమును ?

ప్రభువులకు ప్రాణ మిత్రుడవై
ప్రజలకు ప్రాణ మిచ్చితివి,

లక్ష్మి కాదని నవ్యవాఙ్మయ
లక్ష్మి గొల్చితివి !

నీవు పుట్టిన రాయవరము
నీవు మెట్టిన విజయనగరము
నీ యశస్సు విధాననే ఎ
న్నేళ్ళయిన నిల్చున్.

నాల్గు కోట్ల తెలుంగు ప్రజ లీ
నాడు తను "జాతీయకవి" నీ
వే యటంచును దశదిశల ఎ
లెత్తి పాడుదురు.

అఖిల మానవ హృదయ సీమల
ఆవరించిన నీ మహాత్మకు
ఏమి ఇత్తును, నీకు నచ్చే
ఈ 'సరాలు' వినా ?

................. ......

.....................

.....................

.....................

# 10· మధ్య — భేదము

పద్యానికి గద్యానికి మధ్య
ప్రాచీనులు పెట్టిన గోడలు
నేడో రేపో పూర్తిగ
నేలకు పడిపోవచ్చు.

దేశానికి దేశానికి మధ్య
ద్వేషాలను పెంచే తత్వం
దూరమయే కాలమెంతో
దూరం లేదనవచ్చు

దేశానికి కాలానికి మధ్య
తేడా తొలగించే జ్ఞానం
త్వరలోనే వశమైపోవుట
తథ్య మనే యనవచ్చు.

పుట్టుకకూ చావుకు మధ్య
బుడగల వలె వెలిగే బ్రతుకులు
చిరకాలం నిలిచే రీతిగ
పరిణామం రావచ్చు.

నరులకు అమరులకూ మధ్య
నరవరు లూహించిన భేదం
క్రమముగా తొలిగి పోవటము
ఖాయమనే చెప్పవచ్చు.

స్వప్నానికి సత్యానికి మధ్య
పారే భ్రమవాహిని మీద
వంతెనలను కట్టే రోజులు
వచ్చాయని అనుకోవచ్చు.

నాకానికి లోకానికి మధ్య
చీకటికి వెలుతురుకు మధ్య
కలదని నమ్మిన భేదం
కల్లయనే అనవచ్చు.

22

# 11. నా పాట

నా తెలుగు వెలుగు వీణలు మీటి పాడెద
నా తెలుగు జాతి ఉన్నతి గీతి పాడెద

వాడ వాడల చెలిమి
మేడలను కట్టి
తెలుగు తల్లికి భావ
దీపాలు పెట్టి ॥నా తెలు॥

నిన్న మొన్నటి స్మృతులు
నేటి అనుభూతులు
రేపటి మసక కలలు
నే పాటలుగ అల్లి ॥నా తెలు॥

ఆనందముల తేలి
ఆ వేదనల సోలి
ప్రణయ గీతులు కొన్ని
ప్రగతి పాటలు కొన్ని ॥నా తెలు॥

లోకాన చైతన్య
రేఖలే కురియగా
శైశిరములేని వా
సంతాలు విరియగా ॥నా తెలు॥

## 12. అయిదు అయిదడుగులు

మానవుడు, యంత్రమ్ము ఒకలై
మార్పు చక్రము త్రిప్పుచున్నవి
శ్రమము, త్యాగము, భావిభారత
జాతి సౌధము నిల్పుచున్నవి.

చేతన ప్రభ పూచె నేడా
సేతు శీతాచలము నిండుగ
ఎన్నొ నవభావనల రాకెటు
లెగసినవి నా హృదయ రోదసి.

చీకటుల చెండాడి వెన్నెల
వాకలను పండించి రదిగో,
వెలుగు బాటలు వేసి భారత
వీరు లోకశ్రై నడిచి రిదిగో.

డిల్లిలో, ప్రతి పల్లెలో రా
జిల్లె నవ నిర్మాణ శోభలు,
గనులలో, క్షేత్రములలో కిం
కిణుల మ్రోసెను భాగ్యదేవత.

నదులు నదములు ప్రేమసాగర
హృదయలై ఆ కొండ కోనలు
వీడి వచ్చెను పల్లెసీమలు
చూడగా, వేడుకలు హెచ్చెను.

సాగరము పాలైన ఝురులే
శ్రమిక జీవుల నవ్య జీవన
సాగరములై --- నాగార్జున
సాగరములై పొంగివచ్చెను.

రూరుఖేల, బిలాయి, దుర్గా
పూరులోన, బిహారులోన,

భారతీయార్థిక విధాన సు
ధీర తాల్చెను 'ఉక్కు కవచము'.

నా ఎడదలో నా గృహమ్మున
నవ్వె విద్యుద్దీప మాలలు
నేడు ప్రతి ఊరున స్థిరముగా
నిల్చె దీపావళి విలాసము.

ప్రతి భరత పౌరునికి విద్యా
మృతము ద్రాపును నేడు శారద
జీవితాశలు పండగా వ
ర్షించెను ప్రజాస్వామ్య నీరద.

మన దృఢమ్మగు ఏకతా బల
మునకు లోకము విస్తుపోయెను
మన సదాశయములకు తన సం
పదల చేర్చెను ప్రకృతి దేవత.

అయిదు అయిదడుగులుగ ముందుకు
అదుగో భారతజాతి సాగెను
కాంతి చిమ్మెడి దివ్య సీమలు
కానుపించెను కనుల మేరల.

## 13· జవహరులాలు

ఓ భారతదేశ మూలస్తంభమా !
ఓ మానవజాతి శాంతిబింబమా !

ఒరిగిపోయితివా నేడు నేలకు !
తరలిపోయితివా స్వర్గసీమకు !

జోహారులు, జోహారులు,
జోహారులు నెహ్రూజీ !
సర్వ మానవుల శ్రద్ధాం
జలు లివిగో పండిట్‌జీ !

విశ్వ జనాళా జ్యోతిని
విషవాయువు లార్పెనా !
పుడమితల్లి హృదయంలో
బడబాగ్నులు నించెనా !

గగనలక్ష్మి దుఃఖ మేఘ
ముల దేలి విలపించెను,
మానవతయు, సమానతయు
దీనముగా శోకించెను.

నీకు ప్రియమ్మౌ హిమగిరి
నీరాజన మిడెను నీకు,
నేడు నదీనదములు క
న్నీటి గంగలై పోయెను.

ప్రతి దేశ పతాకలు శో
భా భరమున వంగిపోయె,
ప్రతి జీవన రంగము వే
ద తనమ్మున కృంగిపోయె.

బాలబాలికలు "చాచా
జీ" లేడని విలపించిరి,
పూలు, గులాబీలు నీ వ
రాల నవ్వులేక వాడె.

నీవు లేని భారతమ్ము
నే విధి ఊహింతు మయ్య !
నీవు లేని ఢిల్లీ పురి
తావి లేని పూవయ్యెను !

నీ జీవిత లీలామృత
నీగధ వర్ణింప తరమే !
నీ వియోగ బాధ నుడుల
లో వివరించుట వశమా !

ఎవ రోదార్చెదరు మమ్ము
ఈశ్వర నిభుడా ప్రియతమ
నాయక రత్నమును కోలు
పోయిన ఈ దౌర్భాగ్యుల ?

కనులకు కన్పడవు గాని
కలవు నీవు జగ మెల్లెడ,
పలుకలేవు గాని ప్రగతి
పథము చూపుచుందు వెపుడు.

ఆ సంద్రములందు నదుల
యందె కాదు నీ మహాత్మ
కలసిపోయె దేశ కాల
ముల జీవిత నదుల కూడ.

నీ ఆశలు ఆశయములు
నెరవేర్చ ప్రయత్నింతుము,
స్వాతంత్ర్య సమైక్యతలను
శాంతిని పరిరక్షింతుము.

ఇంతకన్న నీ దివ్య
స్మృతి కేమిటి ఈయగలము ?
దీవించుము మమ్మెప్పుడు
దివ్యలోక భూషణమా !

## 14· పొదుపు పిలుపు

పొట్ట మాడ్చుకొని నిన్ను
పొదుపు చేయ మనలేదు,
కట్ట బట్ట కోసమైన
ఖర్చు చేయ కనలేదు.

భావి జీవితమ్ము కూడ
భద్రపరచుకొ మ్మంటిని,
నీ దేశం కొరకు కొంత
నిన్ను సాయపడ మంటిని.

మనిషి, యంత్ర మైక్యముగా
'మార్పు రథము' లాగాలి,
శ్రమము, త్యాగ ధనము చేర్చి
ప్రగతి పథము వేయాలి.

దారిద్ర్యము నుండి స్వర్గ
ధామము సృష్టింప లెమ్ము,
చీకట్లను పిండి కాంతి
లోకము నిర్మింప రమ్ము.

మన నదులను, మన గనులను
మన శ్రామిక జన బలమును
సర్వ సంపదలు కురిసే
జలదాలుగ మార్చుటకై —

పొదుపు చేయమంటిని, తృణ
మో పణమో ఇమ్మంటిని,
శక్తి కొలది నీదు దేశ
భక్తి చాటుకొమ్మంటిని.

# 15. అజేయుడు

ఓటమి నా కను నీడల
కోటలు దాటే కాలం
జగద్గోళమున గాలులు
చలియించే దాక రాదు.

శరదంబుదు డెవడో గ
ర్జన చేసెను నా కెదురుగ
నా ఉచ్ఛ్వాసానిలాన
నలిగి నశించే దెరుగక.

పాపం తన కసి బాకును
నా పై కే విసిరె నెవడో
వజ్రాయుధ మే నాకు
వశమై పోయిన దెరుగక.

నడి యాకాశమ్మున వె
ల్గెడి 'కాంతి నిధి' ని నాపై
కుటిలాత్ముం డెవడో చీ
కటి దుప్పటి కప్ప జూచె
పురిటిలోనె నిశా గోళ
మును కాల్చిన నన్నెరుగక.

నా కీర్తి కిశోరిని భ్రమిం
గాలని నాలో దూరెను
మానవ మృగ మెవడో తన
ప్రాణమె పోయే దెరుగక.

అమల సత్యమే రక్త
మ్మై ప్రవహిస్తుంది నాలో,
వీరత్వము గాండీవపు
నారులైన నా నాడుల.

సౌందర్యము నా చూపుల
యందు వాసమై యున్నది,
అభ్యుదయం నా స్ఫుట మే
ధాకృతి గొని అవతరించె.

ప్రకృతిలోన నేను నాలో
ప్రకృతి లీనమై యున్నది,
నా ఓటమి ఈ జగద్వి
నాశమునకు సంకేతం,
నా వికాసమున లోకము
నాకమ్మౌతుంది నిజం.

## 16. లాల్ బహదుర్

నడి రాతిరి నీ జాతిని
విడిపోయితివా !
ప్రతి గుండియలో దీపము
విడిపోయితివా !

అణ్వస్త్రమ్ములను మించు
ఆత్మ బలమ్మును వహించి
కాలచక్రమును త్రిప్పిన
లాలు బహదూర్ శాస్త్రి ! ॥నడిరా॥

జోహారులు జోహారులు
జోహారు లివే !
శోకావృత లోకాదృత
జోహారు లివే !

తల్లి భారతిని, సతీమ
తల్లిని లలితాదేవిని
భయశంకా శోకజలా
వర్తమ్మున త్రోసి నీవు ॥నడిరా॥

నెహ్రూజీ అస్తమయము
నించిన నిస్సహాయతా
తమమును దిగమ్రింగి, అమృత
ధారలు వెలయించినావు !

జయ కిసాన్ జయ జవాన్
జయ గర్జారవములతో
శౌర్యాగ్నులు రేపి భరత
జాతికి విజయమ్ము గూర్చి ॥నడిరా॥

కనులకు ఐదడుగు లెత్తు
కన్పించిన నేమి నీవు
ప్రతిభాద్యో శిఖరముపై
ప్రజా శక్తివే అయితివి

'తాష్కంటు' లోన శాంతి
తపసు జేసి, మానవతా

తీ తోన్నతి నంది స్వర్గ
తీర మెగసి పోయితివా ! ॥నడిరా॥

బద్ధ శత్రు వన్నవాడు
పరమ మిత్రుడైన వాడు
వంచినారు శిరములు నీ
భౌతిక దేహమ్ము నెత్తి,

మంచిని ప్రేమించినావు
మనిషిని ప్రేమించినావు
నిను ప్రేమించిన భరతా
వనికై బలియైనావు ! ॥నడిరా॥

నిను కోలుపోయినట్టి
నర లోకము పేదవడెను
నిన్ను కూడ పొందినట్టి
సుర లోకము ధన్యమయ్యె,

'తాష్కంటు' నీ మహోజ్వ
లాశయ కాంతి స్తంభము
నీ దివ్య స్మృతి మా కిల
నిత్యోదయ రవిబింబము ! ॥నడిరా॥

## 17 ఎగసిపోయే హృదయం

ఎగసిపోయే
నా హృదయమా !
ఎంత దూరము పోదువే ?
ఈ దిగంతా
లన్ని దాటి
ఏ జగాలకు పోదువే !

ఈ వసంతకుమారి నవ్వులు
ఇంతలోనే ఆరు ననియా ?
ఏడు రంగుల ఇంద్రచాపము
ఎంత సేపో నిలువ దనియా ?

ఆ సుమము చిలికించు గంధము
ఈ సుమము వెలిగించు అందము
కలిసి వెలిగే పూలకోసం
కలయజూచి నిరాశ జెంది. ॥ఎగసి॥

లేమితో పోరాడు పేదల
కేమి సాయము చేయలేక
పరుల కష్టము దోచు దనుజుల
శిరములను ఖండించలేక. ॥ఎగసి॥

బ్రతుకు బాధ సహించలేవు
మరణమును ప్రేమించలేవు
నేలపై కాలూనలేవు
నింగి శిఖరము చేరలేవు. ॥ఎగసి॥

నిన్ను వలచిన దాని నొల్లవు
నీవు కోరినదేమొ దొరకదు
వెలుగు చీకటి కలిసి తిరిగే
వింత లోకపు టంతు తెలియదు. ॥ఎగసి॥

నీవు కలగన్నట్టి లోకం
నిజంగానే చేరగలవో !
ఇన్ని ఊహాలతో తపించి
ఎండమావుల మీరగలవో ! ॥ఎగసి॥

## 18· ఈప్స

పికవధూ ! నీ పాట విను ఓ
పిక రవంతయు లేదు నాకిక,
వినదలంచితి విశ్వమానవ
విజయ గీతములు.

ఈ వనాంతర సీమ పూచిన
పూవులను గన తృప్తి గల్గదు,
వేచియుంటిని పేద బ్రతుకులు
విరియు నెపు డంచు.

చైత్ర పూర్ణిమ లోన నా ఎద
సంతసమ్మున పొంగ జాలదు,
కనదలంచితి శ్రమిక జీవుల
కనుల వెన్నెలలు.

శూన్య గగనములోన మెరిసెడి
చుక్కలం గని మురియజాలను,
అరయదలతు కుటీరముల భా
గ్యాల దీపములు.

సైకతస్థల విహారమ్ముల
శాంతి కల్గదు నా మనస్సుకు,
కోరుచుంటిని సమసమాజ వి
హార జీవితము.

ఈ తలిరు గాడుపుల డోలల
నా తనువు పులకింపజాలదు,
ఆశ కలదు ప్రజా ప్రమోదో
చ్ఛ్వాసములపైన.

ఈ వసంతోదయము గూరిచి
భావగీతులు పాడలేనిక,
ఈ దరిద్ర జనావళికి భా
గ్యోదయమ్మెపుడో !

## 19· అనునయం

మృదు మధు గీతానుభూతి
ఎరుగని ఓ నా కలమా !
మధు మాసోషస్సులు రా
నున్నవిలే వగవకుమా !

నీ వ్రాసిన జీర్ణ శిశిర
గీతా లాహ్వాన మొసగ
శుకపిక సమతా గాన
ప్లుత వాయు తరంగమ్ముల
నవ వాసంతోషస్సులు
తమము చీల్చి వస్తున్నవి. ॥మృదు॥

జర్జరతానల బాధిత
జీవిత సైకత పథాలు
అభ్యుదయ శ్యామల సీ
మా వీధులు చేరగనే
ఆ జీవిత శోభా కా
వ్యములను రచియింతువులే ! ॥మృదు॥

## 20· అలారం

చీకటి పుట్టల బుస కొ
ట్టుట నేర్చిన ఫణమా !
వెలుగు పూల పొదలలోన
విలయ నాట్యమేలా !

ఇవి తెన్నెరుగక తడబడు
బరిపదములు కావు సుమా
కదం త్రొక్కి నడచు ఇనుప
కాలి యడుగు లివి కనుమా !

కాటు వేయ చూశావా
కాల నలుగుశే సుమా ! ॥చీకటి॥

చలి వీడిన మా చేతుల
తో నీ విషగళం నొక్కి,
కోరలూడ బెరికి చీ
కటి బుట్టలోన నెట్టి,

నిలువున ఆడించేమా
నిలిపెదవా నీ విలయం ? ॥చీకటి॥

తూర్పు దిశా పాత్ర నుండి
తొణికిపడే కాంతి సుధల
కారుమబ్బువై త్రాగే
కాల మెపుడో పోయె సుమా !

కళ్ళు మూసు కెన్నాళ్ళు
పిల్లి పాలు త్రాగజాలు ? ॥చీకటి॥

# 21. ఏకధార

గోదావరి కృష్ణ నేడు
కూడి పాడగా,
ప్రతి ఆంధ్రుని ఎద సమైక్య
భావ మూడెగా !

జాతిని చీల్చిన గోడల
జాడ మాసెరా,
మూగవడ్డ వీణ తిరిగి
మ్రోయసాగెరా !

కలలు నిజములై కన్నుల
కాంతి నించగా
చరిత్రలో స్వర్ణయుగం
తిరిగి మొలిచెరా !

గతము నుండి గుణపాఠం
గరచి మెలగరా,
ద్వేషానైక్యతలు సమా
ధిలో పూడ్చరా !

ప్రేమవనం నాటు యశ
శ్రీలు పూయగా,
శమామృతము చల్లు సుఖం
జాలు వారగా !

పగిలిన ప్రతి జాలిగుండె
పదిల పడెనురా,
ప్రతి జాతియు స్వీయగృహము
ప్రవేశించెరా !

జాతి జాతి కల భారత
జాతి మనదిరా,
శాంతి క్రాంతి కోరు తెలుగు
జాతి మనదిరా !

జాత్యైక్యత విశ్వ ప్రేమ
గీతి పాడరా,
నవ్య జీవితాభ్యుదయో
త్సవము సేయరా !

గోదావరి కృష్ణ నేడు
కూడి పాడగా,
మహాంధ్రోదయ సౌభాగ్య
మహిమ పాడరా !

# 22· పాడేరు పాట

చూడాలి చూడాలి చూడాలిరా !
పాడేరు నొకసారి చూడాలిరా !

గిరి నాయకుల గాథ
పరిరంభణములలో
వన బాలికలు శోభ
లను చిందు మధు సీమ ! ॥చూ॥

కొండ కొండకు మధ్య
గుండెలన్నియు పగచి,
పచ్చ పచ్చని చేల
పండించు లోయలను ॥చూ॥

ప్రతి రోజు జలదాలు
పన్నీరు కురిపించ
అందాలు సెలయేరు
లై ఆడుకొను భూమి ॥చూ॥

తొలి దేవ కన్యలు ఎ
దో శాపవశమున
చేపలై పడియున్న
"మత్స్యకుండము" నచట ॥చూ॥

పురివిప్పి నటియించు
గిరిజనాభ్యుదయమ్మొ
నిదుర మేల్కొన్నట్టి
చైతన్య సింగమును ॥చూ॥

బ్రతుకులకు తేనియలు
పితుకు చెఱకు పొలాలు
లేమిని హరించు కా
ఫీ తోటల పసందు ॥చూ॥

అట పతులన్ని స్వే
చ్ఛా గానములు చేయు
అచటి గిరిజనము నా
ట్యా నందమున దేలు ॥చూ॥

అచట విద్యాదేవి
అడుగు పెట్టెను నేడు
వెలుగుతో చీకట్లు
వియ్య మందెను చూడు ॥చూ॥

అచటి అణువణువు నీ
కాహ్వాన మిడును రా !
అమృత హృదయముతో అ
చటికేగి రావాలి ! ॥చూ॥

## 23. హేతు గీతి

పర్జన్యం గర్జిస్తేనే
శంపాలత కంపిస్తుంది,
వాసంతం కుసుమిస్తేనే
వాసంతిక రవళిస్తుంది.

'న్యూయార్కు'లు బుసకొడితేనే
'అబర్ను'లు హత మౌతాయి,
ధన రాక్షసి కామిస్తేనే
రణ రావణు డుదయిస్తాడు.

ఆచారం గ్రహచారంలో
పడి నీచంగా చావకురా !
కర్మమ్ముల ధర్మమ్ముల లో
మర్మము తెలియక చిక్కకురా !

## 24· అరకులో అభ్యుదయం

సృష్టికర్త రచించినట్టి
శిష్ట కావ్య పరీమళమ్ములు
అనుభవింప దలంచినావా ?
అరకు లోయకు కదలిపొమ్ము !
భారతావని ఎల్లెడల పొం
గారు నవచైతన్య సంపద
అరసి మురియ దలంచినావా ?
అరకు లోయను చూచిరమ్ము !

ప్రకృతి చేసిన తరతరాల త
పః ఫలమ్మా కొండదేశము
మన మహాత్ముని కలలు నిజమే
ననును ఆ గిరిజన వికాసము !
ఏ వనములందో వెలిగిపో
యే వసంతము మెల్ల మెల్లన
లేమిడే డేలుకొను గిరిజన
గ్రామములు దర్శింపసాగెను !

చీకటులు గూళ్ళు కట్టిన గుడి
సె లందున కాంతులు హసించెను,
కరువు బరువులు మోసి వాడిన
గిరిజనుల బ్రతుకులు సుమించెను.

ఏమి తోచక, కాలు నిల్వక
ఎచటనో తిరుగు సెలయేరులు
ఒక ప్రణాళిక వేసుకొని, క్షే
మకర మార్గము చూచుకొని, ఆ
క్షామ భూములు నేడు సస్య
శ్యామలము కావింప తరలెను.

రకరకాల సుగంధ సుమములు
రమ్యమౌ రసభరిత ఫలములు
నిన్న మొన్నటిదాక మాడిన
మన్నులోనే పొంగి వచ్చెను.

మున్ను ఇచ్చట తపము చేసిన
మునుల అంబరములను పోలిన
నేలలో వ్యవసాయ తపమున
నేడు పచ్చలు పండసాగెను,
గంజినీళ్ళకు లేని వారల
గరిసె లపుడే నిండసాగెను.

అచటి కొండల మహౌన్నత్యము
అచటి లోయల గభీరత్వము
అచటి ప్రజల సదాశయములకు
లొంగిపోయి, ప్రజా ప్రగతికై
మంగళా చరణమ్ము పాడును !

'పోడు' చేసీ, అడవి సంపద
ప్రోగు చేసీ, మోసగాండ్రౌ
బేరగాండ్రకు ధారపోసిన
బీదవా రా కొండవాసులు

తమ అవిద్యను, లేమిడిని ఏ
కముగ నేడు జయింపసాగిరి !

'గన్నెల' గ్రామమున విద్యా
కల్పవృక్షము పాదుకొన్నది,
నవ సమాజ వికాస బీజము
నాటుకొన్నది పల్లె పల్లెను.

వారి 'దిమ్సా' నాట్యములలో
వారి ఆటల పాటలందున
నిర్మలాత్మానంద భావము
నిరాడంబర జీవితమ్ములు
ప్రకృతి పూజా ధర్మ నిష్ఠలు
ప్రతిఫలించును, ఇంపు నించును.

బాట వెంబడి అడవులందున
పాట లల్లెడి పక్షిలోకం
రండి, 'అరకును చూడరండ' ని
గుండియలు పులకించ పిల్చును !
బయలుదేరుము మిత్రమా ! ఆ
భవ్య శోభలు చూడ నేడే !

52

## 25. కృష్ణవేణి

కన్నీరు తుడుచుకో కృష్ణవేణీ ! నీ
కష్టాలు ఈడేరె నమ్మా !
ఇన్నాళ్ళు కన్న నీ కలలన్ని నిజములై
ఆనందములు పండు నమ్మా !

అడవిపాలైన నీ అందాల బ్రతుకునకు
కడలిపాలైన నీ సంసార సంపదకు
మంచినా ళ్ళేతెంచె, మరచిపో గత గాథ,
మధురభావిని నీకు మరిలేదు ఏ బాధ.

నీవు దేశ చరిత్ర గర్భాన పుట్టితివి
ఒక మహాప్రస్థాన మెదియొ తలపెట్టితివి
ఏ నెరుంగుదు జీవన మ్మెందరికో ఇచ్చి
ఎటు తోచ కీవె సంద్రము త్రోవ పట్టితివి.

నీ మహాగాన నిక్వాణమ్ములో కరిగి
పోయెను శతాబ్దా ల వెన్నో,
నీ సుధామయ పుణ్య తీరమ్ములో పెరిగి
పోయె సామ్రాజ్యా ల వెన్నో,
కాని నీ కొక ఆలయమును కట్టనె లేదు
నే నెరుంగుదు నీకు నిల్వ నీడే లేదు.

నీ దరినె గుండె తడి లేని భూముల జూచి
నీ ముందె ప్రజలు పస్తు పడుండుటను జూచి
నిలయమ్ము లేక వారికి సాయపడలేక
నీ ప్రచైతన్య ధారాశక్తి యంతయును
అడవి గాచిన వెన్నె లాయెనే యని ఎంత
గా పరితపించినావో నదీ జననీ !

నవయుగారంభోత్సవమ్ములో ఈనాడు
నవభారత ప్రభాత ప్రభాస్నాతులై
నీ బృహచ్ఛక్తి నిర్భరహృదయము గ్రహించి
తమ జీర్ణ జీవితాలకు సౌఖ్య మాశించి
నీ ప్రజాకోటి దృఢముగ నడుములు బిగించి
నిర్మించుచున్నారు నీకు బంగరుకోట.

అపర బుద్ధావతారు డగు నాగార్జునుని
ధర్మ ప్రబోధ ప్రతిధ్వనిత గిరిసీమ
విస్మృతేక్ష్వాకు సామ్రాజ్య నిర్మిత బౌద్ధ
విశ్వవిద్యాలయ కళాపునీత స్థలుల
నిర్మించుచున్నారు నీకు నాగార్జున
సాగర మహాలయము సౌందర్య నిలయమ్ము !

నీ కనులముందె కళకళలాడి ఆనాడు
కాల పర్జన్య సంపాత నిర్ఘాతముల
నశియించిన విజయపురము పునర్జన్మించి
నీ ప్రాంగణాన నిత్యమ్ము శోభించులే
అలనాటి బౌద్ధ శిల్పసుమాల మాలికల
నీ గృహ మలంకరింతురులే జనులు, తల్లి !

నీ సేవ చేయ పడవలు తిరుగు నీ యింట,
నీ భవన కుడ్యాలపై విశాల ప్రకృతి

సుందర సువర్ణ చిత్రాలు చిత్రించుమలే,
నీ నిలయ సౌందర్య గరిమ తిలకించగా
రసికులు, కళాప్రియులు, అభ్యుదయకాముకులు
దేశదేశాల నుండియు చేరవత్తురిలే.

నీ చూపు ప్రసరించు నంత దూరము నేల
సల్లవించు, శ్రుతించు నవ్యజీవన హేల,
నీ లాస్య జలపాత జనిత జీవన ధ్వనులు
నీ హాస విద్యుజ్జనిత కాంతి రేఖికలు
పట్టణాలను పల్లెపల్లెలో ప్రతి యింట
కలిగించు మోదమ్ము వెలిగించు భాగ్యాలు.

ఆంధ్రదేశమున కాశా శాంతి నిలయమై
నవ భారతాభ్యుదయమునకు సంకేతమై
బాధా దరిద్రాలపై విజయ చిహ్నమై
నీ భూరి సాగర సదనము వర్ధిల్లులే.

నీ మహా గంభీర హృదయ సాగరములో
నీ తేనె కలలు అలలై ఎపుడు ఆడులే,
కన్నీరు తుడుచుకో కృష్ణవేణీ ! నీ
కష్టాలు ఈడేరె నమ్మా !

## 26. అదృష్ట దేవత

ఏ దారిని వస్తావో
ఏ దారిని పోతావో
ఎవరిని ప్రేమిస్తావో
ఎవరిని ద్వేషిస్తావో

ఊహింపగనైన లేము
ఓ అదృష్టదైవతమా !

దారిని పోయేవారికి
కోరి వరము లిచ్చెదవు
నిన్నె నమ్ముకున్న వారి
కున్నదూడిపించెదవు.

ఎంత నిరంకుశురాలవో
ఎంత పంతముల రాణివో

విజ్ఞాన ధనుల చేతను
వెఱ్ఱి పనులు చేపింతువు
అజ్ఞానాంధులకు కూడ
అధికారము లిప్పింతువు

నీ నియమను లెట్లో కాని,
నీ న్యాయము లెట్లో కాని.

ఊరక ఒక నిర్దోషిని
ఉరికంబము నెక్కింతువు
హంతకుడగు వాని నొకని
ఆదరించి రక్షింతువు

ఏది న్యాయమో నీకు ?
ఏది ధ్యేయమో నీకు ?

నా కష్టఫలము మాత్రము
నాకు దక్కనీయవమ్మ !
నన్ను మింటి కెత్తకున్న
నవ్వుల పాలు చేయకమ్మ !

.......................

..... ..................

# 27. చిరంజీవులు

కడలి అలల కలల పుట్టి పెరిగినాము
లలిత
కళల సౌరభాలు మోసి తెచ్చినాము

తీరవాసులం, దూర
తీరవాసులం మేము.

నేల బాస, గాలి బాస తెలుసు మాకు
నేడు
కానరాని వెలుగు జాడ తెలుసు మాకు

తేనె పాటలం, ప్రగతి
చేరు బాటలం మేము.

దండి నదులకన్న ప్రియము కొండవాగులే
మాకు
తమ్మి పూలకన్న ప్రియము రెల్లుపూవులే

పేద గుండెలం, మంచి
ప్రేమజీవులం మేము.

అందము, ఆనందమె కనులండి మాకు
ఊహ
కందని నేస్తమ్మె డెందమ్ము మాకు

కాంతి రేఖలం మేము
శాంతి వాకలం మేము.

ఓటమన్న దెపుడు మాకు ఉండబోదు
మేము
ఓడునాడు భావియన్న దుండబోదు

సిరుల మేరులం మేము
చిరంజీవులం మేము.

## 28· మా తార

అంద చందాలు మి
న్నంద ఆడే గగన
వాటిలో గల కోటి
కోటి తారకలార !

ఒకసారి మా తార
ముఖ దర్పణములోన
మీ ముఖమ్ములు చూచుకొందురో ?
కారు మ
బ్బుల దూరి దాగిపోకుందురో !

మా తార కన్గొనల
జ్యోతిస్సు కనువేళ
మీ కళ్ళలో కారు
చీకట్లు కనిపించు.

తారలని మీ కెవరు
ధారపోసిరి పేరు
మినుకు మినుకున కునక
గనె తారకలు గారు
మా తార ముందు అణు
మాత్రు లౌదురు మీరు.

రివ్వు మని బొంగరము
రువ్వి మా తార వలె

పోటి బొంగరములను
పొడి చేయగలరే !

శ్రోతల ఎదలు రస
స్నాతాలు కాగ మా
తార వలె మీరు గీ
తాలు పాడేరా ?

ప్రకృతి పులకింప, చూ
పరుల ఎదలు ద్రవింప,
శింజినీ మంజు శిం
జితములను తార వలె
అసదృశ విలాస లా
స్యము సేయగలరే ?

నవరసమ్ముల మించు
నవరసమ్మును నించు
మాటలు వచించు ప్రవి
మల హృదయ మా తార
వలె మీ రొకటి యైన
పలు కాడ గలరే ?

తార లేపిన ఆ 'ప
తంగమ్ము' పై నుండి
నేలపై రాలి తా
రా లక్ష్మి జడపూవు
లై, కంఠహారమ్ము
లై, కాలి చిరు గజ్జె
లై, గోటిపై చుక్క
లై, ఆమె సేవింపరే ?
శూన్య గగ
నములోని ఓ తారలార !

తాడిత జగన్నిశా
తార అమృత ధార
తారా యశో జ్యోత్స్న
లో రమ్య తారలై
తార దేహ విభూష
తారలై వెలగండి !
కలకాలము జగాన
కళలు వెదజల్లండి !

## 29. ఆశయ చిహ్నం

అదుగో ! అదిగో ! అదిగో !
అదిగో "మన ఆంధ్రా మెడికల్
కాలేజీ జీవన చిహ్నం"
మన ఆశలు, ఆశయములు ఆకృతి
దాల్చిన సుందర రూపం !

శాంతి సమత్వ ప్రచారక
సిత పక్షాంచల భావ కపోతం
అందాలను, ఆనందాలను
వర్షించే వెన్నెల మేఘం !

తన ముఖ కుంకుమ రాగము మనలో
ఘనసేవా శీలమ్మును పెంచును
తన గళహార ఫణీంద్ర మణిప్రభ
మన అజ్ఞాన తమస్సు హరించును.

తదీయ లోకన నిశిత శూలమున
రుజాజరా మరణాలు నశించును
తదీయ సస్యశ్యామల శోభల
ప్రకృతియెల్ల పులకించి హసించును

ప్రక్కనున్న సాగరమెప్పుడు త
న్మంగళాభ్యుదయ గీతము పాడును
కొండపైని జ్యోతీరమ కన్నుల
పండువుగా హారతులను పట్టును.

జీవనామృతము పంచు వైద్య భూ
షణుల సృజించెడి కళాశాలనే
చిత్రించెడి ఈ చిహ్నము నీడల
నిలచి దాని మది కొలిచెదమూ !
నిరంతరము మన వైద్య సరస్వతి
విజ్ఞానాంబుధి తరచెదమూ !

## 30· ఆకాంక్ష

కోకిలా ! నా పాట
కూడ వినిపించుకో !
నీ కంఠమే ఎంత
దాక మ్రోగింతువే ?
నా వసంతానుభూ
తులను నే వినుతునే !

ఆ కొండ ఆ కోన
ఆ యడవి విడనాడి
ఓ నిర్ఝరీ ! వేద
నానేక గిరులున్న
నా గుండెలో కూడ
సాగవా ? మ్రోగవా ?

ఈ కాళరాత్రి నిం
డా కాంతులను నించు
శంపాలతా ! నా ని
శా జీవితాంగణము
లో కూడ ఆశాద్యు
తులు నింపరావా ?

గగనమ్ము నుండి భూ
గర్భమ్ములో దూకు
ఓ 'నయాగర' గభీ
రోరు జలపాతమా !
నా మనశ్చక్రమ్ము
పై దూకి నాలోన
విజ్ఞాన విద్యుత్తు
వెలిగింపరాదా ?

నెలపాత్రలోని వె
న్నెల త్రాగ పయనించి
వళపడక వెనుదిరిగి
వచ్చే చకోరమా !
చెలికి నా మాటొకటి
చెప్పి వచ్చేవా ?

విరహిణుల ఎదలు కా
ల్చే వెన్నెలల నాపు
మేఘమా ! నా మేధ
లో కలవరము లేపు
భయద భావాల నా
పగ కూడ రావా ?

నవ్యజీవన గీతి
కామృతము కురిపించు
ప్రకృతి ! నీ విశ్వవీ
ణా కల శ్రుతులలో
నను గూడ శ్రుతిజేసి
కొని పాడుకొనవా ?

## 31· మహోద్యమం

మహా తపోనిధులార !
మహాత్ములార ! నేతలార !
నాకు స్వేచ్ఛ కావాలి
నాకు స్వేచ్ఛ కావాలి.

లోకపు చెరసాలలోన
లోహ బంధనాలలోన
బందీ మానవుడ నేను
బానిసల్లో ప్రథముణ్ణి.

నా శక్తికి, నా యుక్తికి,
నా కంటికి, నా బుద్ధికి
అడుగడుగున హిమనగాలు
అడ్డుతగిలి ఎదురు తన్ను.

స్వేచ్ఛ లేదు అని చెప్పే
స్వేచ్ఛ తప్ప స్వేచ్ఛ లేదు.

ఈ క్షణాన "న్యూయార్కు"ను
వీక్షించా లనుకొంటే
విమానాలు 'విసా' గిసా
వెక్కిరించి పోవు నన్ను.

తక్షణమే పారిస్ కా
మాతుల కలవాలంటే
కాలాంబుధి డబ్బు సంచి
గేలిచేసి మరలగొట్టు.

కాలేజీ చదువు పూర్తి
కావచ్చెను, ఏం లాభం ?
నన్ను చూసి రోడ్డుమీద
నవ్విన అమ్మాయి మనసు

లో చొరబడి ఆవిడ ఆ
లోచనల్ని చదువలేను.

చచ్చిన వాళ్ళందరి నొక
సారి వెళ్ళి చూసొస్తే
బాగుండును, కానీ ఇటు
బాటలు కట్టేశారు.

ఊహల్లో ఊగులాడు
తున్న చుక్కలను సృష్టిని
అసలు వెళ్ళి చూడ్డానికి
అన్నీ అడ్డంకులాయె.

అంతెందుకు అయిదు రోజు
లాహారం లేకుండా
బ్రతకటానికైన స్వేచ్ఛ
గతి లేదాయెనుగా.

నా బ్రతుకును నిర్ణయించ
నాకె హక్కు లేనప్పుడు
స్వేచ్ఛ వున్నదనుకొనడం
స్వీయ ఆత్మవంచనం.

దేశానికి కాలానికి
దాసుడనై వాను నేను
భ్రమావరణమును నమ్మిక
బ్రతికితి నిన్నాళ్ళు నేను
మతిచెడి శాస్త్రపు ఎంగిలి
మెతుకులతో తృప్తిపడితి.

స్వేచ్ఛకు దుర్నిర్వచనం
చేసి మోసగించలేరు
ఈ నా స్వాతంత్ర్యోద్యమ
మే శక్తులు నిల్పలేవు.

ప్రళయాందోళనం లేపి
ప్రకృతిని కల్లోల పరచి
బంధిత స్వేచ్ఛా మార్గ క
వాటాలను విప్పేస్తా !

ఆశల కాలోచనలకు
ఆకారం కల్పిస్తా !
స్వేచ్ఛా మానవ పథమున
సిద్ధుడనై జీవిస్తా !

# 32. లోచూపు

లోక బాంధవుని బంధిం
చిన సంధ్యారాక్షసికి
నిరసనగా ఈ లోకము
నిలిపిన నల్ల జండాలె
రాతిరి చీకటు లౌను—
తిష్ఠ వేసి కూర్చుండును,
విజయోషస్సున చెరవిడి
విచ్చేసేదాక ఇనుడు.

పర్జన్యాసుర కరాళ
గర్జారావ ప్రకంపిత
శంపాలతలకు తనింట
శరణ మిచ్చు రేరాణి.

కొండల కోనల బాల్యము
నిండా కష్టాల కోర్చి
యుండుట కాబోలు బ్రతుకు
పండిన సెలయేటి బాల

మహానదీ మతల్లిగా
మారి పంటచేల గనును.

కారణమే లేక విషము
గ్రక్కు నాగఫణులు కూడ
మల్లికా లతాంత గంధ
మాధురులను ప్రేమించును.

ప్రకృతి రహస్యాలు కొంత
పరిశీలించిన వానికి
జీవితమ్ములో అపజయ
మే విధముగ కలుగబోదు.

తన ప్రకృతిని 'ప్రకృతి' లోన
ప్రకృతిని తన ప్రకృతిలోన
చూడగల్గువాడు బ్రతుకు
శోభామయ మని గ్రహించు.

లోకము లోలోనికి నీ
లోకనుల విలోకించుము !
ప్రకృతి రహస్యాలు స్వాను
భవమున పరిశీలించుము !

## 33. క్షుభితాత్మ

నా కన్నులు చెమ్మగిల్లునమ్మా !
నా గుండె ద్రవించిపోవునమ్మా !
ఓ కరుణామయి ! నిను నే
ఆ కరాళ సంధ్యలోన
కాంచినది స్మరించు నపుడు
నా కన్నులు చెమ్మగిల్లు నమ్మా !

నీ చూపులు ఎంత గభీరమ్మో !
నీ హృదయమ్మెంత విశాలమ్మో
నీ భావనలెంత పవిత్రమ్మో !
నేను గ్రహించితిని నమ్మ మమ్మా !
నా గుండె ద్రవించిపోవు నమ్మా !

ఒక ఆత్మీయునికై ని
న్నకలంక స్నేహ సుమము
అర్పింపగ నీయనపుడు
అలమటించు నిను తలచిన
నా కన్నులు చెమ్మగిల్లునమ్మా !

ఒక మానవుని బ్రతుకు చెం
తకు నీదు దయానురాగ
పరిమళానిల వీచికల
ప్రసరింపగ నీయ నపుడు
స్రుక్కిన నీ మూర్తి తలచి
నా గుండె ద్రవించిపోవునమ్మా !

నీ నిర్మల హృదయ కపోతమ్ము
ఈ నీచ విషాత్మక సంఘమ్ము
నీ విశుద్ధ వాఙ్మధు సారమ్ము
ఈ వికృతోగ్ర నీతి వర్షమ్ము

చూచి బ్రతుకు చితికిపోవు తల్లీ !
చుక్కవైన కావు, గగనవల్లి !

వేయి పవిత్ర చిత్ర భావములు
వివరించిన నీ ముఖ గ్రంథమ్ము
సరిగా తెలిసికొనలేదు నేను,
పొరపాటులు కలవరించినాను.

బ్రతుకు లోతులలో దూరు
స్మిత ప్రభామాలిక లటు,
మానవతాత్మపై విసము
మసి పూసెడి భూతమ్మటు
విలోకించి కంపించితి తల్లీ !
వెర్రినైతి నేను, రాగవల్లీ !

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D. P. R. I.
Acc. No. 10868

ఈ వాసంతమ్మునీ ఉషస్సునీ
ఈ విద్యుల్లతికల పూర్ణిమలనీ
నీ హిమాలయోన్నత శీలమ్మును
నీ ఆనందకళా రూపమ్మును
ప్రేమింతును నిండు గుండెతోడను
సామాన్యుడనైన మానవుడను,
ఓ మానవతార్ద్రి కల్పవల్లీ !
నీ మదిలో నిలవనిమ్ము తల్లీ !

## 34· జీవనరాగం

చమురు లేని ఆ దీపం
చల్లారదు ఎందులకో !
తీగ తెగిన ఆ వీణియ
మ్రోగునింక ఎందులకో !

ఆకలితో ఈ చలిలో
చీకటిలో పడి మూల్గెడి
దీనుల కన్నుల ఆశా
దీపమ్ములు ఎక్కడివో !

వనధి సమాధిని చేర
వచ్చిన వాహిను లెందుకు
తిరిగి పారిపోవ ఇంత
తీవ్రముగా యత్నించునో ?

కాటిలోన కూడ బ్రతుకు
బాటవైపు ఆకర్షణ !
ఈ జీవన్మరణ సంధ్య
నెడ తెగని ఏదో ఘర్షణ !

అబ్బా ! ఈ లోక మెంత
ఆశా భావోన్మాదిని !
రాబోయే రవి కోసం
రాత్రు లెన్నియో సహించు !

బ్రతుకు తీరమున నాలో
భావించిన భావ మేదో ?
పొంగి పొంగి నా ఈ అను
భూతి గీతమై పోయెను !

## 35· అమ్లాన సిమ్లా

మరపురాదు మరువలేను
మళ్ళీ జన్మలోనైనా
సిమ్లాలో నే పొందిన
అమ్లాన మహానుభూతి !

అచటి వెన్నెలే వేరు
అచటి గాడ్పులే వేరు
అచట ప్రకృతి కూర్చుకొన్న
అందాలే వేరు !

వెన్నెల మధుపానమ్మున
మిన్నంటిన తెలికొండలు
గుండెలపై తేలి ఆడు
కొందురు వనకాంతలు !

చిరుగాలులు ప్రణయగాథ
పరవశలై లాస్యమాడు
కోటి కోటి లతికలు మధు
కుసుమ హస్త ముద్రలతో !

ప్రేమికులను దీవించుచు
వేల్పులు చల్లెడి ముత్యపు
రాసులవలె శుభ్ర హిమ ప
రాగము కురియును అయ్యెడ !

పూలతోడ విద్యుద్దీ
పాలతోడ పరిమళించు
కొండలు కావవి, ప్రకృతి
గుండియ లనిపించు నహో !

యువ దంపతులకు స్వర్గము
నవతకు పెట్టని దుర్గము
రాగము గల ప్రతివానికి
రసలోకమునకు మార్గము !

## 36. ఇరవై ఏళ్లు నిండె

పుట్టినాను భరతజాతి
పూర్ణత్యాగ ఫలమై,
పెరిగినాను భరతమాత
ప్రేమరాగ లతనై.

ఇరువదేండ్లు నిండెను నాకీనాడు,
పరిమళించె అనుభూతులెవో నేడు.

తన ప్రాణముకన్న మిన్న
నను ప్రేమించిన గాంధిని
పుట్టి పుట్టగానే పో
గొట్టు కొంటిని,
బాలారిష్టముల నుండి
బ్రతికించిన సర్దారుని
పాలబుగ్గలపుడే విధి
పాలు చేసుకొంటిని,

ఎంత దురదృష్ట వంతురాలనో నేను,
ఇంతనాడె అంత కష్టకాలము చూశాను.

పండిత జవహరు ప్రతిభా
వజ్ర కవచమును ధరించి
ప్రజా శక్తి ప్రణాళికల
పాలబువ్వ సేవించి
ఆటపాటలతో దేశ
మంతట వెలిగాను,

ఖండ ఖండములకు శాంతి
కపోతముల పంపాను,

మనిషిలోని దైవత్వము పెంచాను
మండిపడే అసురత తల త్రెంచాను.

"లక్ష్మి ! స్వాతంత్ర్య మహా
లక్ష్మి" యని నను కొలిచిరి
"మా బతుకుల పండించెడి
మధు మాస"మ్మని తలచిరి
కులమత కలహముల విడచి
కులగిరుల విధము నిలిచిరి
కర్షకాళి, కార్మికాళి
కష్టపడే మానవాళి !

అయిదు అయిదు అయిదు అడుగులేశాను,
అసమానత మీద కత్తి దూశాను.

ఘన బాక్రానంగల్, నా
గార్జున సాగరము లనెడి
నవజీవన భాండమ్ముల
నా భుజములపై ఇడుకొని

ఉరు భిలాయి రూర్కేలా
ఉక్కు కవచమును ధరించి
శాంతి విప్లవోర్వశినై
సౌభాగ్యవనము పెంచుట

చూచి మండిపడిన కీచకాధముల
పీచమడచి చల్లితి వెన్నెలల !

మీ ఆశలు ఆశయాలు
మీ ఆనందాకాంక్షలు
రూపించిన స్వర్గసీమ
చూపుమేర కనరాదని
వ్యధ పడతగునా ! సాగర
మథనమ్మొక నా డగునా ?
కాలాబ్ధిని ఒక బిందువె
కాదా ఇరవై ఏండ్లన ?

స్వాతంత్ర్య మహా భారత జనులారా !
సాగిరండు ననువీడక ప్రియమార !

# 37· ప్రగతి గీతి

ఈ దేశం మనదేశం
ఎంత మారిపోయెరా !
ప్రజలు కన్న కలలెన్నో
నిజాలు అయిపోయెరా !

చేతి కందకుండ పరుగు
తీసే నదులెన్నో
ప్రేమతోడ నిల్చి బీడు
భూములు పండించెరా ! ॥ఈ దేశం॥

బండిబాట లేనిచోట
పడెను రైలు బాటలూ,
కాలిబాట లేనిచోట
కానబడెను రోడులూ. ॥ఈ దేశం॥

చమురు దీపములు సైతం
సరిగా వెల్గని పల్లెల
కంటికింపుగా వెల్గె, క
రంటు దీపమాలలూ. ॥ఈ దేశం॥

దుక్కిదున్ను మోటలాగు
బక్క ఎడ్ల మొర వినెనో
అవతరించె ట్రాక్టర్లూ,
ఆయిలు ఇంజెనులూ. ॥ఈ దేశం॥

నానుగల్లు, బాక్రాలో
నందికొండ లోయలలో
నలిగిపోవుచున్నది ఇ
న్నాళ్ళ లేమి రాకాసి. ॥ఈ దేశం॥

రూరుఖేలలో, బిలాయి
లో, దుర్గాపూరులో
ఉక్కు పరిశ్రమల నుండి
ఉదయించెను నవభరతం. ॥ఈ దేశం॥

పంచవర్ష ప్రణాళికల
పథమందున ప్రజలంతా
సహకారపు రథముపైన
సాగిరదే! విజయముతో! ॥ఈ దేశం॥

ఊరూరా పాఠశాల
ఉచితవిద్య లందరికీ,

ఆరోగ్యం ఉద్యోగం
అవకాశా లందరికీ. ॥ఈ దేశం॥

మన భారత సమాజాన
మధుమాసం వికసించెను,
మన శ్రేయో రాజ్యలక్ష్మి
మంగళగీతులు పాడెను. ॥ఈ దేశం॥

భుజం భుజం కలిపి నేడు
ప్రజాబలం సాగుతోంది,
సహకారం, సమానత
శాంతి, వెల్లివిరుస్తోంది. ॥ఈ దేశం॥

భరతజాతి చైతన్యం
కడలివోలె పొంగె నదె !
పంచవర్ష ప్రణాళికల
ప్రజాభ్యుదయ మయ్యె నదే !

ఈ దేశం మనదేశం
ఎంత మారిపోయెరా !
ప్రజలు కన్న కలలెన్నో
నిజాలు అయిపోయెరా ! ॥ఈ దేశం॥

# 38. సందేహ వీచి

పికమునై వాసంత
మాధురులు గొందునా,
ఈ రూప సౌందర్య
మే తమసి గలియునో ?

మబ్బునై శంపా ర
మణితో సుఖింతునా,
సెలయేటి పాట లెం
తగ దూర మౌనో ?

దినరాజునై కమల
కన్యను వరింతునా,
రేయి కడలిని విరహ
వాయువులు కాల్చునో ?

కాలాహినై రాక్ష
సుల కాటు వేతునా,
రూపమ్ము గని మిత్రు
లే భ్రమసి కూల్తురో ?

## 39. పరిణామం

సంవత్సరమంతా వా
సంతమ్మే శోభిస్తే
పికరవ సంగీతం క
ర్ణ కఠోరమ్మౌ నేమో ?

కోరినప్పుడెల్లా ఓ
కోమలి కౌగిలి లభిస్తే

ప్రణయ ప్రపంచంలో ఇక
పసయేమీ ఉండదేమొ ?

మరణ రోగముకు పక్కా
మందే కనిపెట్టబడితె
చావడం అనేది గడ్డు
సమస్య అవుతుందేమో ?

మరుపు అనే గుణం మనిషి
మనసు నుండి తొలగిస్తే
చిరస్మృతులు అతని గుండె
చీల్చి కాల్చివేయునేమొ ?

నారీ వస్తువునే రచ
నల్లోన నిషేధిస్తే
రచయితలకు అసలు ఉప్పు
రాళ్లైనా పుట్టవేమొ ?

అధికారాలు లభించే
అవకాశాల్లేకపోతె
వినాయకుల సంఖ్య ఇంత
విపరీతం కాదేమొ ?

# 40· సిమ్లాలో చిన్నది

సిమ్లాలో చూచితి నొక
చిన్నదానిని
కలల అలలు రేపు మత్తు
కనుల దానిని.

మాలు రోడ్డుమీద అదో
మాదిరిగా నవ్వింది
చలచల్లని లోయల, వె
చ్చని గాడ్పులు రువ్వింది.

ఉరు జఘనము బిగువు చనులు
సరితూగగ నడిచింది
వేల మన్మథులను కలచి
వేయు శరము విడిచింది.

మంచు పొరల వంటి పైట
మరచి జార విడిచింది
జగతిగోళ అమరగోళ
యుగళము ప్రకటించింది.

మెయి వంపులతో వలపుల
మెరుపువోలె మెరిసింది
నాలో ఒక భావ వసం
తమును నాటి పోయింది.

## 41. ఆహ్వానం

కొమ్మలలో కోకిలమ్మ
కుహూ, కుహూ మన్నదే
నిన్ను నన్ను జంట గూడి
నేడే రమ్మన్నదే !

కొండమీద సెలయేటి
గుండె ఝల్లు మన్నదే
మనము ఆడి పాడకున్న
మనలే నంటున్నదే !

పచ్చని తోటల మోములు
వాడిపోవు చున్న వే
మన ప్రణయ విలాస వసం
తముకై వేచియున్న వే !

తెల్లని వెన్నెల మబ్బుల
తెరల దూరుచున్నదే
మన వియోగ విలయాగ్నికి
మండుచుంటి నన్నదే !

కడలి కెరటములు మనకై
కదలి వచ్చు చున్న వే
తీరమ్మున మనము లేక
తిరిగి పోవుచున్న వే !

చీకటి లోకమును జూచి
చంచల కంపించెనే
కంపములో మన గుండెలు
కలిసి కౌగలించెనే !

## 42· దాసోహం

కామినీ విలాస నటన
కథనమ్మో భువి చరిత్ర,
భామినీ వినూత్న నాట్య
రంగమ్మో ఈ ధరిత్రి.

ఇతిహాస పురాణాలు
సతి నిమిత్త కలహాలు
ప్రతి కావ్య ప్రబంధానికి
ఇతివృత్తం 'సతి శీలం'!

సామ్రాజ్యా లేలిన ఘన
సమ్రాట్టులు రణవీరులు
రమణీ దృగ్వల్లుల ఘో
రముగా బందీ లయారు !

నారాయణ మంత్రముగ్ధ
పారాయణు లౌ యోగులు
నారీ మధురాధరామృ
తారాధకు లౌ భోగులు !

నీ లేమిని జగద్యంత్ర
మాగిపోవు, ధూళి రేగు
చిక్కదనీ కౌగిటిలో
ఎక్కడకూ పోను నేను
దాసోహం - దాసోహం
ఓ సఖి ! కళాముఖి !
ప్రణయ వాహినీ ! రాణీ !

## 43. దీపగీతి

విలసత్తారా సుమాలు
విరిసిన గగనోద్యానం
ధరణీతల దర్పణాన
ప్రతిఫలించినట్లు తోచె!
ఈ రేయిని నా ఎదలో
ఎనలేని ప్రభలు పూచె!

సంజ కాంతులే దీపపు
పింజల రూపమ్ము దాల్చి
పశ్చిమాద్రి నుండి గృహ
ప్రాంగణాల దిగి వచ్చెనో?
చీకటి బ్రతుకులు ఆశా
స్మిత రోచులు వెలిగించెనో?

ఇరుల గుడిసెలో ప్రక్కన
సిరుల మేడలో సుమించె
సమరీతిని జ్యోతు లెన్నొ
సమతా భావము స్ఫురించ,
దీన జనుల క్షేమ కనుల
ధ్రువ తారలు ప్రకాశించ.

అడుగడుగున దిగ్జయ కా
హళుల మ్రోత వినిపించెను
బాల బాలికావళి దీ
పాల వోలె కనిపించెను
ప్రతి రమణీమణియు సత్య
భామ యై విజృంభించెను!

ప్రకృతి కన్యకే కన్నుల
పండువైన దీపావళి
స్వర్గమునే కాలదన్ను
సర్వ కళా శోభావళి
పులకించిన నా లోపల
పలికించెను కావ్యావళి!

ఏయేటా క్రొత్తదిగా
నే తోచును దీపావళి
ఏయేటా ఈ దివ్వెల
తోట క్రొత్త పూలుపూయు
దీపావళి శాంతి గృహో
ద్దీపకమై వచ్చుగాక !
దీపావళి దీనజనుల
దీవింపగ వచ్చుగాక!
దీపావళి దీపావళి
దివ్య నవ్య దీపావళి!

## 44. విజయ శంఖం

"కనులు కలిగినట్టి, లోన
కనులు కలిగినట్టి కవీ!
నేడు కానరాని వెలుగు
జాడ ఎరిగినట్టి రవీ!
విజయదశమి నీ మదిలో
వెలిగించిన భావ గీతి
వినుచు" మంచు నన్నాజ్ఞా
పించెను ఆకాశవాణి!

వాణి చేతిలోని రాగ
వీణయైన నా హృదయం
పులకరించి అణువు అణువు
తొలకరించి పాడు నహో!

మనిషి జీవితమ్ములోన
మ్రాకు జీవితమ్ములోన
మనిషి మ్రాకులను గను భూ
మాత జీవితమ్ములోన
శిశిర వసంతాలు చిత్ర
చిత్రముగా వచ్చిపోవు
విజయము అపజయము వెంట
వెంటనె నర్తించిపోవు.

ధర్మమునకు విజయమ్ము అ
ధర్మమునకు అపజయమ్ము
తప్పదు అంతిమ విజయము
తప్పలేదు మానవతకు.

పొడి వీడి నూరుగురును
ఓడినారు కౌరవులు
పొడి వీడలేని పంచ
పాండవుల కరాలలోన
శత మాయోపాయులైన
చౌలు అయూబు లనేకులు
చితికిపోయినా రొక శాం
స్త్రీజీ ధర్మాస్త్రమ్మున.

పది తల లుండిన రావణ
బ్రహ్మ నీతి ఎరుగలేక
పతనమౌట నేటి భుజా
బలులకు పాఠమ్ము కాదె!

అణ్వాయుధ శక్తి కన్న
ఆత్మ బలమ్మే మిన్న
ఆడంబరులను కాదు, దేశ
భక్తిని పెంచాలన్నా!

డేగల గని బెదరకు ఉ
డ్డీన శాంతి పావురమా!
ప్రేమ సుధలు వెదజల్లుచు
ద్వేషాగ్నులు ఆర్పుమా!

యుద్ధమ్మును కోరెడి దు
ర్యోధను లెందరో లేరు,
శాంతిని కాంక్షించెడి కృ
ష్ణార్జునులే కల రెల్లెడ.

కోతి నుండి ఈ మానవ
జాతి పుట్టినది మొదలు
రాతియుగము నుండి నేటి
రాకెట్టు యుగము వరకు

సాధించిన విజయమ్ములు
శాశ్వత కాంతి దుర్గములు.
కలిగిన అపజయములు క్షణ
కాల శరన్మేఘమ్ములు.

న్యాయము కురుక్షేత్రమ్మున
నాటుకొనెను విజయవాటి,
వ్యాస భారతమున వాణి
వేసుకొనెను విజయపీఠి.

"అజంతా గుహలు" చిత్ర క
ళామతల్లి జయమాలలు
'తాజమహలు' ప్రణయ దేవ
తా పూర్ణ విజయపతాక
ఆగస్టు పదిహేను స్వే
చ్ఛా లక్ష్మికి ఘన విజయము
సిమ్లా కాశ్మీరు ప్రకృతి
అమ్లాన విజయహాసము—

విజయ పరంపరల స్వరూ
పిణియౌ ఈ విజయదశమి
విజయ మెపుడు కూర్చుగాక!
విశ్వశాంతికిని ప్రగతికి!

# 45· హిమపాతం

( 1968 నవంబర్‌లో నెదరులండులో తొలిసారి చూచిన హిమపాతం )

హిమపాతం! హిమపాతం
హేమంత సంగీతం
నల్లని మబ్బుల క్లబ్బులు
అల్లే తెల్లని గీతం—

చెట్ల చెలులు, లతాంగనలు
స్ప్రిప్టి జొనరించె
మేడలు వాడలు రోడులు
గోడలు పళ్ళికిలించె ॥హిమ॥

పచ్చని పంట పొలాల
పాఁరెను క్షీరములు
నీటి కాలువల నిండా
నిండెను మీగడలు ॥హిమ॥

జంటజంటలుగా వీధుల
వెంట తిరుగు ప్రేమికుల ౬,
డళ్ళ నిండ కురిసె బొడ్డు
మల్లెల మొల్లల జల్లులు ॥హిమ॥

కిట కిటలాడే జనాళి
క్రిస్‌మస్ పండుగ దినాలు
ఆనందం అనురాగం
ఆరబోసె ముత్యాలు ॥హిమ॥

ఏమి హిమము! ఏ మహిమ మెయొ?
ఎల్ల జగము తెల్లబోయె
వెలుపల చలి, లోపల చెలి
వెచ్చదనం నిండిపోయె ॥హిమ॥

## 46· కలగాదది నిజము

కలగాదది నిజము
గాలిలోన
గగన వీధి
కలిసి కొంటిమే, మనము ॥కలగా॥

నీ వలపుల చలిమబ్బులు
కురిసెను వెచ్చందనము
నీ వెచ్చని చిరునవ్వుల
విరిసెను చందనము ॥కలగా॥

నా కౌగిటిలో నీవు
నీ కన్నులలో నేను
ఎగసిపోవు విమానంపు
ఎదలో మన మిద్దరము ॥కలగా॥

ఉడుపథమ్ము క్రుంగినది
ఉత్తరాబ్ధి పొంగినది
మనలో ఐక్యమై స్నేహ
మాధురులను పొందుటకై ॥కలగా॥

చిత్ర చిత్రమైన కళా
సీమలెన్నొ చూపినావు
పలుకు పలుకులోన, అమృత
భావరసము త్రాపినావు ॥కలగా॥

నీవు సాగినావు ననీ
నేల మీద దింపి వేసి
వీడిపోయినావు ఎదో
వీడని బంధమ్ము వేసి ॥కలగా॥

నవ పరాగ విభవమ్మిడి
నారమవై నావు నీవు
నా ఎదలో నాట్యమాడు
నా ఉమవై నావు నీవు

( కోపన్ హేగన్ నుండి లండన్ వెళుతున్నప్పుడు కలిగిన ఒక అనుభూతికి అక్షరరూపం )

109

## 47· ఎన్నెన్ని అందాలు

ఎన్నెన్ని అందాలు
ఈ భూమి మీద,
ఎన్ని ఆనందాలు
ఈ బ్రతుకులోన—

కడలి కెరటాల పై
కదలు నౌక అందం
కొండ కొమ్మల కూరు
చుండు నౌక అందం ॥ఎన్నె॥

స్వార్థమెరుగని స్నేహ
బంధ మానందం

లిప్త మాత్రపు కామ
తృప్తి ఆనందం ॥ఎన్నె॥

పల్లె సీమలను వ
ర్ధిల్లు నొక అందం
పట్టణాలకు అట
పట్టువొక అందం ॥ఎన్నె॥

తెనెటూపాల కలల
తేలుటానందం
అంబరాన విమాన
యాన మానందం ॥ఎన్నె॥

పూల, అమ్మాయినగు
పూల ఒక అందం
ఉభయ సంధ్యల, తల్లి
ఒడినొ కానందం ॥ఎన్నె॥

అందమానంద మా
నందమే అందం
ఎందేగినా, మన
స్పందనా నందం ॥ఎన్నె॥

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.

## 48· నెదరు లాండు

ఆలమందలు, పూలతోటలు
అచ్చరల తలదన్ను బోటులు
స్నేహ శీలము వెలుగుచుండు
నేల తీయని నెదరు లాండు.

దృఢతరంగ తురంగములతో
తీరదేశము నాక్రమించిన
ఉత్తరాబ్ధిని త్రిప్పికొట్టిన
యోద్ధజాతి నివాసభూమి ॥అల॥

ప్రకృతి అసదృశ దృశ్యములు, * "రెం
బ్రాంటు" వ్రాసిన చిత్తరువులు,
కాంస్య శిలల అనల్ప శిల్పము
కలిగి వెలిగే కళాకల్పము ॥అల॥

కలదో బృందావనము లేదో
కలదో నందనవనము లేదో
కలదు వానిని మించు పూవుల
కడలి • "కూకెన్ హోఫు" అచ్చట ॥అల॥

పేరుగల కంపెని "ఫిలిప్సు",
సౌరుగల పూవులు "ట్యులిప్సు",
జాతి ఆర్థిక జీవనమునకు
ధాతలై వర్ధిల్లు దేశము ॥అల॥

వేడి గాలుల తేలిపోయే
పైడిమేనుల నగ్నశోభలు

* విశ్వవిఖ్యాత చిత్రలేఖకుడు
• విస్తార మనోజ్ఞ పుష్పవన ప్రాంతం

MEMORIAL LIBRARY V. R. NARLA D. P. R. L.

* "స్ఛెవినంగన్" బీచిలో కను
జీవి ధన్యుడు జిత సురేంద్రుడు ॥ఆల॥

గాజు కిటికీ గదుల కూర్చుని
కౌగిళులు కాముకుల కమ్మే
వీరవేశ్యల వాడలచ్చటి
వింతలకు గిలిగింతలండీ! ॥ఆల॥

రాజయోగి హేగునగరము
రాగభోగి ఆంస్టరడాం
నగర యుగళము రాజధాని
జగన్ముకుర స్వర్గ బింబము ॥ఆల॥

భారతికి విజ్ఞాన పీఠము
శ్రీరమకు పచ్చల కిరీటము
ఉమకు జీవన లాస్యరంగము
యువత నవతారామ శృంగము ॥ఆల॥

ప్రేమమయి జులియాన రాణి
ప్రియతమ ప్రజాస్వామ్య వాణి
విద్యల వినోదాల చెండు
వెరసి చక్కని నెదరులాండు ॥ఆల॥

---

* హేగులోని విశాల సుందర ఉత్తర సాగరతీరం

# 49. పత్రము—చిత్రము

చెలియ పంపె ఒక పత్రము
దాని వెంట తన చిత్రము

పత్రములో దాచింది
ప్రణయభావ శతపత్రము
చిత్రములో దాచింది
చిరునవ్వుల చైత్రము ॥చెలి॥

పత్రములో ప్రతి మాట
చిత్రమైన ఒక పాట
చిత్రములో ప్రతి రేఖ
చెప్పరాని ఒక లేఖ ॥చెలి॥

చిత్రములో పత్రములో
చిత్రించిం దొకటేను
ఒకటే, రూపము - ఆత్మ
ఒకటేను, తాను - నేను ॥చెలి॥

పత్రము పఠియించాను
పంచాతురి నై నాను
చిత్రము దర్శించాను
చిన్మయుడై నాను ॥చెలి॥

# 50· నడిరాత్రి—సుమగాత్రి

నడిరాత్రి సుమగాత్రి
నడచి వచ్చె నా గదికి –

    నా గదికి నా హృదికి
    నా భావ కుసుమ వనికి –

సుమవనికి రసధునికి
నా కోర్కెల ఆమనికి –

    ఆమనికి ఆ దివికి
    నా ఆనందాంబుధికి
    నడచి వచ్చె సుమగాత్రి

సుమగాత్రి
మధుపాత్రి
నా జీవన సావిత్రి
నడచివచ్చె నడిరాత్రి

    నడిరాత్రి
    సుమగాత్రి
    నడచివచ్చె నా గదికి
    నా భావ కుసుమ వనికి

## 51· నరుడో నారాయణుడో

ఎగసి పోయితి, ఎగసి పోయితి
ఎపుడు ఎగరని యంత దూరము
సింధువులు సేతువులు దాటి
చేరబోయితి క్రొత్త తీరము —

పాల సంద్రమువంటి నీరద
డోలికలలో ఊగిపోయితి,
మృదుమధుర పవనాతిథేయుల
మెరపు నగవుల తేలిపోయితి ॥ఎగసి॥

"లోకమా, సురలోకమా"యని
లోచనమ్ములు విస్తుపోయిన
ఖండమందున కాలు మోపితి
కలను వాస్తవికతను చూచితి ॥ఎగసి॥

సీతనెప్పుడు విడని రాముని
చిన్ని మచ్చయు లేని చంద్రుని
రాజ్యకాంక్షే లేని రాజును
రాగపీఠముమీద చూచితి ॥ఎగసి॥

అతని చల్లని చూపులందున
అమృత హేమంతమ్ము వీచెను
అతని వెచ్చని స్వాగతమ్ముల
ఆమనులు అందాలు పూచెను ॥ఎగసి॥

అతని ప్రతి చిరునవ్వులోన, స
హాస్య సుమగంధాలు చిలికెను

అతని ప్రతి మృదువాక్కులోన, స
హాస్య రసగ్రంధాలు పలికెను ॥ఎగసి॥

ప్రేమదండము పూని, హృదయా
రామసీమల నేలు రాజు
రాజులును, దినరాజు బాపని
బ్రతుకు చీకటి బాపు రాజు ॥ఎగసి॥

అతనికిని అతనునికి రూప
మ్మందు అంతర మెంతొ లేదు
కాని శీలమునందు పూ విలు
కాడు కా డాతనికి జోడు ॥ఎగసి॥

అతని హస్తము అన్నపూర్ణ
ఆత్మ మురళీ గాన ఘూర్ణ
నవ్యజీవన ప్రభాజనకుడు
నరుడొ నారాయణుడొ అతడు ॥ఎగసి॥

వేణువై నా ఎడద మ్రోగెను
నా నవాక్షర గిరులలోయల
ఉత్తరాంబుధి, దక్షిణాంబుధి
ఉడుపథమ్మునకెత్తె ఊయల

# 52. పూలప్రస్థానం

(ఒక అమెరికన్ జానపద గేయం విన్నతర్వాత కలిగిన అనుభూతిలో)

ఏవీ ! ఈ పూవులన్ని
ఏమైపోతున్నాయి ?
పూలా ! అమ్మాయిల జడ
పూలై పోతున్నాయి —

ఏరీ ! అమ్మాయిలంద
రేమైపోతున్నారు ?
అమ్మాయిలు, అబ్బాయిల
అండ జేరుతున్నారు —

ఏరీ ! అబ్బాయిలంద
రేమైపోతున్నారు ?
అబ్బాయిలు సైనికులై
అనికి సాగుతున్నారు —

ఏరీ ! సైనికులందరు
ఏమైపోతున్నారు ?
సైనికులా ! చచ్చిపోయి
సమాధులౌతున్నారు —

ఏవీ ! సమాధులన్ని
ఏమైపోతున్నాయి ?
పుణ్యమా సమాధులన్ని
పూలైపోతున్నాయి —
ఏవీ ! ఈ పూవులన్ని
ఏమైపోతున్నాయి ?...
......................

# 53. పూల కడలి

నెదరు లాండులో నేడు
నిదుర లేచినవి పూలు
నిదుర లేచి నిదుర లేపె
ఎద ఎదలో పరిమళాలు -

తొలి వలపుల 'ట్యులిప్' పూలు
పలు వన్నెల గులాబీలు
రూపవతుల 'డ్యాఫడీలు'
దీపించె వసంతవేళ - ॥నెదరు॥

పూబోటుల మధురోహల
పులకరించె మట్టినేల
కై పెక్కి పురాలు తేలె
కార్నివాలు సంబరాల - ॥నెదరు॥

ఆంస్టర్‌డాం హేగులోన
ఆల్సుమీరు, హార్లేమున

పూల కిరీటాలతోడ
వేల మన్మధులు వెలసిరి - ॥నెదరు॥

కోమల *'సుమబాల' లంత
• 'కూకెన్ హోపు'న కూడిరి
పూ విల్తుల మతిపో నా
నా విధ నాట్యములాడిరి - ॥నెదరు

సాగిరి "ట్యాబూ"లో లను
శతవర్ణ కుసును రథాల
సుమ గాత్రలు సుమ నేత్రలు
శుభ వాసంతోత్సవాల - ॥నెదరు॥

తీవెల నగవులు పూవులు
పూవుల వలపులు తావులు
పూవులు తావులు యువజన
జీవనరాగము లాయెను - ॥నెదరు॥

పూవు లేని పెరడులేదు
తావిలేని తావులేదు
నెదరు లండు పూలచెండు
చెదరక నా ఎడదనుండు - ॥నెదరు॥

* Flower Girls • ప్రపంచ ప్రఖ్యాతమైన పూలతోట

123

## 54· నదీ నదీ రైను నదీ

అలా ఆలా, గలా గలా, పాడే నదీ
ఐరోపా హృదయంలో ఆడే నదీ
కలవంటి, కథవంటి, రైను నదీ
కదలించె నా మదిలో కవితా నదీ -

ఆల్ప్స్ పర్వతాల ఒంటపుట్టినదీ
అందమైన ప్రకృతి ఇంట మెట్టినదీ
ముచ్చటైన పచ్చగౌను వేసినదీ
ముదిమిలేని కళారాణి రైను నదీ
కదలించె నామదిలో కవితా నదీ ॥అలా॥

స్నానము జెనివా కొలనుల చేసినదీ
షాపింగు జర్మనీలో చేసినదీ
పూలేమొ హాలెండున పెట్టినదీ
కడలి కౌగిలింపు చేరు రైను నదీ
కదలించె నా మదిలో కవితా నదీ ॥అలా॥

ఒయ్యారంగ తన దారిని సాగినదీ
"ఒహో ! ఆహా !" యంచు జనం చూచినదీ
చిరునవ్వుల సౌభాగ్యం చిందినదీ
చిరయశస్వి రసతపస్వి రైను నదీ
కదలించె నామదిలో కవితా నదీ ॥అలా॥

మనిషి మనిషి రక్తమెంత పీల్చినదీ
మతంపేర మానవతను చీల్చినదీ
దేశ పటాలెన్నిసార్లు మార్చినదీ
చూచిన సాక్షీమతల్లి రైను నదీ
కదలించె నామదిలో కవితా నదీ ॥అలా॥

125

# 55. పంచేంద్రియ సుఖం

ఐరోపా హృదయంలో
*"హైతాత్రా", "లోతాత్రా"
ఆమని విరిసిన సీమల
లో మన్మథు చైత్రయాత్ర -

సెలయేటి కలువదండల
కళకళలాడే కొండల,
వెచ్చదనం పచ్చదనం
వెదజల్లే వనకాంతల
చూశాను - ॥ఐరో॥

మంచు దాడులకు జడిసి
మట్టిలోన దాగిపోయి,
దినరాజు అభయ మీయగ
పునరాగత సుమ గంధము
గ్రోలాను - ॥ఐరో॥

---

* చకస్లావేకియాలోని పర్వత ప్రదేశాలు

బ్రతుకు బాధ మరిపించే
రసడోలల ఊగించే
నర నారీ నట గీతము
నటనాలయ సంగీతము
విన్నాను - ॥ఐరో॥

వన్నెలాడి కపోలాలు
వెన్నలాంటి కరతలాలు
లాస్యమాడు లే కౌనులు
హాస్యమాడు చిరు గౌనులు
తాకాను - ॥ఐరో॥

మధుపాయి సుధాధరము
మధుర పక్వ కిటి మాంసము
'స్లీవోవిచ్' సురపానము
జీవన వాసంతము రుచి
చూశాను - ॥ఐరో॥

సుందర సమతా జీవన
నందన వన స్లోవేకియ
సంచార స్మృతిధారల
పంచేంద్రియ ఇంద్ర సుఖము
పొందాను - ॥ఐరో॥

## 56. మర్ మేడ్

కోపెన్ హేగన్ ప్రక్కన
కూరుచున్న మర్ మేడ్
సాగర తీరము మీది
మూగ శిలా సుందరి!

జలధి తరంగాలలోన
జలక మాడ వచ్చి
అలలో కలలు కంటూ
అలా ఉండి పోయావో ? ॥కోపెన్॥

వలువలన్ని గట్టుమీద
వదలివేయ సుడిగాలికి
ఎగిరి వలాహకము లౌట
ఇలా దిగంబర వైతివో ? ॥కోపెన్॥

నీట మునుగు రాకుమారు
నీవు రక్షము చేసిన
చేపట్టక పోవనతడు
సిగ్గుతోడ శిల వైతివా ? ॥కోపెన్॥

మనసు దోచుకొని పోయిన
మనోహరుడు వచ్చుదాక
మోహన రాగ తపస్సున
మునిగి వేచి యున్నావో - ॥కోపెన్॥

కథలకు కమ్మని కలలకు
కళలకు జీవము పోసెడి
మూర్తిగా చెరగిపోని
కీర్తిగా వెలసినావో ? - ॥కోపెన్॥

# 57. బాపు

ఉన్నాడు ఉన్నాడు బాపు
నిన్న, నేడు, రేపు ఉన్నాడు ॥ఉన్నాడు॥

నీ లోన నా లోన
నిఖిలావని లోన
శాంతికై క్రాంతికై
సాగు యాత్రల లోన ॥ఉన్నాడు॥

జాతి భేదము లేని
నీతి వర్తనలలో
మత విభేదము లేని
హిత బోధనములలో - ॥ఉన్నాడు॥

స్వార్థాల చెరబడిన
సత్యాల విడిపించ
సమరాల తడబడిన
శాంతిని నడిపించ - ॥ఉన్నాడు॥

బ్రతుకులో మనిషికి
వెతల, మానవతకు
ఆరని వెలుగు చూపు
అమర దీపము బాపు ॥ఉన్నాడు॥

129
V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

# 58. కూలివాడు కుబేరుడు

పొదుపో యమ్మ పొదుపు !
మదుపో యయ్యా మదుపు !

కలిగిన ఆదాయంలో
మిగిలించుట పొదుపు
మిగిలించిన దాన్ని పెంపు
చేసుకొనుట మదుపు ॥పొదుపో॥

పెళ్లానికి తెలియకుండ
పెనిమిటి చేయాలి పొదుపు
భర్తల కంటే మిన్నగ
భార్యలు చేయాలి పొదుపు - ॥పొదుపో॥

తల్లి ఇచ్చు చిల్లరతో
పిల్లలు చేయాలి పొదుపు

MEMORIAL NARLA D.P.R.L. Acc. No.

కూడబెట్టి మదుపు పెడితె
కుటుంబానికే అదుపు - ॥పొదుపో॥

ఒకటో తారీఖేమో
ఉద్యోగుల పొదుపుదినం
పంట అమ్ముకున్ననాడె
పల్లె రైతు పొదుపుదినం- ॥పొదుపో॥

కూలివాడు పొదుపుచేసి
కుబేరుడై పోవచ్చు
కోటీశుడు పొదుపులేక
కూలివాడు కావచ్చు- ॥పొదుపో

నిన్న పొదుపు చేసుకుంటె
నేడు లేదురా దుఃఖం
నేడు పొదుపు చేసుకుంటె
రేపు కలుగుతుంది సుఖం- ॥పొదుపో॥

చెప్పిరావు కష్టాలు
చెప్పిరావు నష్టాలు
అన్నింటా పొదుపు చేసు
కున్నవాడే ఉన్నవాడు- ॥పొదుపో॥

# 59. మహబూబ్ నగరం

రండి రండి మహబూబ్ నగరం
రసజగాలు మీ కిడును స్వాగతం

డెందమున్న వాళ్ళను, ఆ
నందపరచు అందాలు
చూడరండి ప్రకృతి కన్య
చూపేటి విలాసాలు ॥రండి॥

ఐదు నూర్ల ఏళ్ల పడచు
ఐదు వేల జడల సొగసు
చల్లగ మిమ్ముల పిలిచే
పిల్లల మర్రిని చూడ ॥రండి॥

కోరి కోరి లక్ష్మీశుడె
కోవెల నిర్మించుకొన్న
మబ్బులనే తాకు మేడ
మన్యంకొండను చూడ ॥రండి॥

అచ్చంపేట కొండల
పచ్చని అడవుల గుండెల
విచ్చిన గిరిజనుల చేవ
ముచ్చటగా చూచి పోవ ॥రండి॥

పాతాళమునంటు లోయ
ప్రక్క కొండ కొమ్ము మీద
దరహాసం చిందు తార
పరహాబాదును చేర ॥రండి॥

దూర దూరముల నుండి
తుంగభద్ర తెచ్చుకున్న
అందాలను కూర్చుకున్న
ఆలంపురమును కనగా ॥రండి॥

కైలాస గిరికన్న
కాశీపురముకన్న
గొప్పగా కళాశిల్పము
గుడులు కట్టుకున్న దచట ॥రండి॥

సరళ కోయిల పాటల
చిరజీవన సాగరాల
కృష్ణానది తరంగాల
అలా అలా తేలిపోవ ॥రండి॥

## 60· బంజరు భూములు పంచారు

బంజరు భూములు పంచారు
బ్రతుకు బాట చూపించారు

ఏమీలేని పేదవారికి
ఎవ్వరు కానని హరిజనాళికి
అడవుల నుండే కొండవారికి
అరకబట్టగల కూలివారికి ॥బంజరు॥

పాలేరుండిన పెస్తులు పండిన
పల్లెల నుండే బీదవారికి
తాశిల్దారులు తాలుక్దారులు
దేశనాయకులు మంత్రి వర్యులు ॥బంజరు॥

పట్టాలిచ్చిననాడె, ఉగాది
పండగైనది బీదసాదలకు
పంటలు పండిననాడే, లక్ష్మి
ఇంటికి వచ్చెను అనదలకు ॥బంజరు॥

ఎరువులకోసం ఎద్దులకోసం
అప్పులు కూడ ఇప్పించారు
చిన్నరైతులు మిన్నగ చేసే
సేద్యపురీతులు చెప్పించారు ॥బంజరు॥

ఆలు మగలు ఒక్క రెక్కగా
అలసట అనక కష్టించాలి
పిల్లలనేమో చదివించాలి
చల్లని భావిని నిర్మించాలి

136

## 61. పాలమూరు పనివాళ్లం

పనివాళ్లం పనివాళ్లం

పాలమూరు పనివాళ్ళం

ప్రాజెక్టులు నిర్మించే

పాలమూరు పనివాళ్ళం

నాగార్జున సాగరాలు
నాసుగల్లు బాక్రాలు
కట్టినట్టి, నదుల కిళ్ళు
కట్టినట్టి కార్మికులం పనివా॥

పోచంపాడుకు జీవం
పోసేటి శ్రామికులం
శీలేరున విద్యుత్తులు
తీసేటి భగీరథులం ॥పనివా॥

నాడు రాజులకు కోటలు
నేడు బ్రతుకులకు బాటలు
నిర్మించిన పనివాళ్ళం
ప్రగతికి పునాది రాళ్ళం ॥పనివా॥

పాలమూరులో పుట్టి
భరత ఖండమెల్ల చుట్టి
కార్య దీక్షలో మెట్టి
కనుమూసే కూలీలం ॥పనివా॥

# 62. భిన్నత్వం

ఒకడేమో వికచ పుష్ప
ముఖరేఖలు వర్ణిస్తే
వేరొక్కడు దాని గొంతు
పిసికి పరీక్షిస్తాడు

భిన్న భిన్న తత్వాలు
ఉన్నాయి మనిషి మనిషికి

ఒకడేమొ హిమాలయాల
శిఖరారోహణ చేస్తే
ఒకడేమొ భూగర్భా
నికి గోతులు తీస్తాడు

భిన్న భిన్న ఆశయాలు
ఉన్నాయి మనిషి మనిషికి

ఒకడేమొ విభావరిలో
ఉదయగీతులాలపించు
ఒకడేమొ ఉషాకుమారి
ముఖము చూచి కంపించు

భిన్న భిన్న అభిరుచులు
ఉన్నాయి మనిషి మనిషికి

ఒకడొక తరుణమ్మును, వా
సంతోషస్సని యంటె
వేరొకడది దారుణ, హే
మంతరాత్రి అంటాడు

భిన్న భిన్న పరిమాణాల్
ఉన్నాయి మనిషి మనిషికి

ఒకడొక పథగమ్యం, స్వ
ర్గకళాసీమలు అంటే
వేరొకడది భీకర నర
కాగ్ని చేర్చు నంటాడు

భిన్న భిన్న దృక్కోణాల్
ఉన్నాయి మనిషి మనిషికి

# 63. కన్నీళ్లు

హేమంతా ! కానబడవు
ఏమై పోయావమ్మా !
ఆడబోయి, దారి తప్పి
అమరపురికి చేరావా ?

అమ్మ ఏడుస్తున్నది, రా
వమ్మా, బంగారు బొమ్మ !
కల పోలికనైన వచ్చి
కన్నీరు తుడిచిపొమ్మా ! ॥హే॥

అమ్మమ్మ, తాత నిన్ను
రమ్మంటున్నా రమ్మా !
తమ్ముడు, అన్నయ్య, అక్క
బొమ్మలు తెచ్చారమ్మా ! ॥హే॥

నాన్నమీద అలిగి దాగి
నావా ? కనరావా ?
మామల మాటైనా విని
మా యింటికి రావా ? ॥హే॥

## 64· చర్విత చర్వణం

ఎన్నిసార్లు ఎన్ని తీర్లు
ఈపాటే పాడుచుంటి,
ఎంతకు దాహము తీరని
వింతరసము త్రాగుచుంటి

పూవు వని, తావి వని
దేవి వని నిను కొలచితి
అందము, ఆనందము నీ
పొందున గలదని తలచితి ॥ఎన్ని॥

ఊహల రాడారు వేసి
ఉడుపథాలు శోధించితి
కలల వలలు వేసి నిన్ను
ఇల నెల్లెడ గాలించితి ॥ఎన్ని॥

రాకెట్టై నిన్ను చంద్ర
లోకమ్మున వెదకినాను
సబ్ మరీనునై సమస్త
సాగరాలు కలచినాను ॥ఎన్ని॥

క్షణక్షణము నిన్నుబోలు
చంచలలను దర్శింతును
కలవో లేవో నీవు
కాని నే గవేషింతును ॥ఎన్ని॥

# 65. భా వా లు

ఎదలోన భావాలు
కదలాడు తాయి
కాగితము రమ్మంటె
కనులు మూస్తాయి

నే నిదురపోగానె
నిదుర లేస్తాయి
లేచి నే కలమూన
లేచిపోతాయి ॥ఎదలో॥

ఎదురేగి పిలువగా
బెదరి పోతాయి
తీరనప్పుడు వచ్చి
కూరు చుంటాయి ॥ఎదలో॥

గొంతెత్తి పాడుమన
గుస గుసలు పెట్టు
గుస గుసలు ఆడుమన
బుస బుసలు కొట్టు ॥ఎదలో॥

అందాలు చూస్తుంటె
అగ్గి మాటాడు
ఆకలికి కేకలిడ
గా జోల పాడు ॥ఎదలో॥

వాటి ఇష్టమ్మె నా
మాటలే వినవు
వాటి మాటలు విని
వ్రాతు కవితలను ॥ఎదలో॥

## 66. ఏకతా సేతువు

ఒక్కటేరా! తెలుగుదేశం
ఒక్కటేరా! తెలుగుభాష
ఎక్కడున్నా తెలుగులందరు
ఒక్కటేరా! ఒక్కటేరా!

ఒక్కచే గోదావరీనది
ఒక్కచే కృష్ణానది
రెండు నదులూ తెలుగుజాతి
గుండెలో ఒకటైనవి "ఒక్క"

అరుకులోయల గాలికొండ
హైదరాబాద్ గోలకొండ
కలిసికట్టైను తెలుగుతల్లి
కంఠసీమను పూలదండ "ఒక్క"

సాగరమ్మొక వైపున, నిజాం
సాగరమ్మొక వైపున
తెలుగుతల్లికి వీచు చల్లని
అలల వీవన లంద మొప్పగ "ఒక్క"

ఎదలు ఎదలు కూర్చి కట్టిన
ఏకతా సేతువుల మీద
కదలి వచ్చే అభ్యుదయ చ
క్రాల నడ్డుట చేటు కాదా! "ఒక్క"

నలుగు రెవరో తప్పు చేసిన
నాల్గు కోట్లకు శిక్ష తగునా!
ఎలుక లేవో దూరినాయని
ఇంటినే తగలేయ తగునా! "ఒక్క"

పాడి తప్పక పాటుపడదాం
పంటలు పరిశ్రమలు పెడదాం
మెండుగా ఉత్పత్తి పెంచి
దండిగా అందరము ఉందాం ॥ఒక్క॥

పేదపోయిన తెలంగాణము
పెంపయిన సర్కారు ప్రాంతము
మధ్య రాయల సీమ తమ్ముల
మధ్య భేదము మాపి వేదాం ॥ఒక్క॥

ఆకలికి ఆవేశమునకు
అహంకృతికి ద్వేషమునకు
మంచిచెడ్డలు కనంబడవు
మంచి మాటలు వినంబడవు ॥ఒక్క॥

ఒక్క జాతిని రెండు ముక్కలు
ఒక్క గుండెను రెండు చెక్కలు
చేయ తగదని చేయ తగదని
చేతులెత్తి వినతి చేదాం ॥ఒక్క॥

# 67. అద్వైతం

ఒక స్వప్నము సత్యమాయె
ఒక సత్యము స్వప్నమాయె
సత్యము స్వప్నము కలిసి
నిత్య జీవితమ్మాయెను

జలధులెగసి ఝురులాయెను
ఝురులుసాగి జలధులాయె
జలధులు ఝురులును కలిసి
జగతికి జీవమ్మాయెను

నరుని సృజించెను శ్రీహరి
హరిని సృజించెను నరుడు
హరి నరులు కలిసిపోయిన
ధరణి, స్వర్గమై పోయెను

కాంతి ఆరి ధ్వాంతమాయె
ధ్వాంతమారి కాంతి ఆయె
కాంతి, ధ్వాంతములె దేశపు
కాలపు రూపము లాయెను

నీవు తరిగి నేనాయెను
నేను పెరిగి నీవాయెను
నీవు నేను కలిసినపుడు
నింగి నేల ఒకటాయెను

169

# 68. చుక్కల్లో ఉషశ్రీ

ఉషారాగమును
నిశానాగములు
ఓర్వలేక మ్రింగినవి

రవి హృదయమ్మున
కవి హృదయమ్మున
కారుమబ్బు కమ్మినది ॥ఉషా॥

నేలతల్లి ఇటు
నింగితండ్రి అటు
క్రుంగి క్రుంగి ఏడ్చినవి ॥ఉషా॥

మమతల పూవుల
మనసుల తీవెలు
మసలి విధిని దూరినవి ॥ఉషా॥

ఎక్కడో వెలుగు
చుక్క పాపల, మ
రొక్క తార చేరినది ॥ఉషా॥

## 69. ఆరని వెలుగు

ఆరిపోవని వెలుగు జిమ్మి
ఆరిపోయిన దీపికా !
వాడిపోవని పూలు పూచి
వీడి పోయిన వల్లికా !

నిన్ను కన్నుల చూడలేదు
నీ వెలుగు చూచితి మహాత్మా !
బ్రతుకు తీవెను గంటి, నీ నవ
భావ సుమగంధములు బాపూ ! ॥ఆరి॥

పోరుబందరులోన నీవు
పుట్టినప్పటినుండి గాంధీ !
పోరుసల్పితివయ్య భారత
పారతంత్ర్యము తీరుదాక ॥ఆరి॥

కేలు చూపి మహోగ్ర సేనల
డీలువడగొట్టిన తపస్వీ !

చేతికర్రను ఊపియే, జగ
జ్జేతలను తరిమిన యశస్వీ ! ॥అరి॥

మాధవుడు మహమ్మదుడు ఒకడే
ఈశుడును ఏసుడును ఒకడే
లోకహిత జీవన ధురీ గ
మ్యాకరమ్మొకటేను అంటివి ॥అరి॥

మానవతకై నీవు నాటిన
మహిత సత్యాహింసవాటిక
కుల మతత్వపు దానవత్వపు
క్రూరమృగముల పాలబడియెను ॥అరి॥

అంతరిక్షము గెల్చినాడు
అణువు డొక్కను చీల్చినాడు
మానవేంద్రుడదేమొ హింసా
మకరి దంష్ట్రిల చిక్కినాడు ॥అరి॥

స్వార్థమును సత్యముగ చూపి
శాంతి బ్రతుకున దుమ్ము రేపే
నాటకమ్ముల బూటకమ్ముల
వేటలాపుట ఎట్లు బాపూ ! ॥అరి॥

ప్రేమనాగస్వరము నేడు
ద్వేష సర్పమునకు రుచించదు
ద్వేష ఫణములు ప్రేమనే
దీవించినట్లు నటించి కాటిడు ॥అరి॥

సామ భేదోపాయములచే
శత్రువులను జయింప వచ్చును
మిత్ర రత్నములట్లు కులికెడి
శత్రువులను జయించుటెట్లు ?

పాదరసమే మైలపడి పో
యే దినాలివి బ్రతుకుటెట్లు ?
ఎవడు మనుజుడో, ఎవడు దనుజుడో
ఎవడు దేవుడో ఎరుగుటెట్లు ?

అందరికి నీవన్న ప్రియమే
అందరికి నీ వాక్కులమృతమె
ఎందరిల నీ సత్యమార్గము
నందు నడుతురో నీ వెరుగవే ! ॥అరి॥

నీ స్మృతిప్రభ మాసిపోక
నీ శ్రుతి సుమాల్ వాడిపోక
లోకమును అభ్యుదయ శాంతి
వాకగా నడిపించు గాక ! ॥అరి॥

153

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

## 70. పరమాత్మలో ఆత్మ

ఏడు కొండల వేంకటేశా !
హేమహాస రమా విలాసా !

నేలకందక నింగికందక
లీలగా ఈ గాలిమేడల
నీకు నీవే వెలసినావో ?
లేక ఎవరో నిలిపినారో ॥ఏడు॥

నేను వరములు పొందకుండనె
నీ మహిమ గుర్తించి నేడు,
ఏవో ఏవో కోరకయె, నీ
కోవెలకు వచ్చాను, చూడు ॥ఏడు॥

ఎన్నికొండలు లేవు దేవత
లెందరెందరు వెలయలేదు
ఎవరి నమ్మక నేను నిన్నే
ఏల నమ్మితి, తెలియరాదు ॥ఏడు॥

రూపమన్నది లేని దేవుని
రూపు నీలో చూచినాను,
పాపమన్నది చేయకున్నను
నీ పదమ్ములు చేరినాను ॥ఏడు॥

ఆత్మ నాలో ఉన్నచో, పర
మాత్మ నీలో ఉండదా ?
లోకమన్నది ఉన్నచో, పర
లోకమన్నది ఉండదా

బాధపుట్టిననాడె, భగవ
ద్భక్తి పుట్టిన దందును,

నీవు ఉన్నా లేకపోయిన
నేను కొల్చుచు నుందుమ ॥ఏడు॥

ప్రేమమన్నది, స్నేహమన్నది
నా మతముగా చేసుకొంటిని,
నా మతమ్మున కీవె రూపము
గా మదిని భావించుకొంటిని ఏడు॥

నమ్మెదును పరిణామ వాదము
నమ్మెదును దేవముఖ వేదము
చదివినేర్చి పదార్థ జ్ఞానము
వెదకుచుంటిని ఆత్మజ్ఞానము

నేను స్వయముగ పుట్టలేదు
కాన చావక ఉండలేను
చావులేని స్వయంభు వీవు
చచ్చినా నిను వీడలేను

DCP

AOUAIUIBIO4

BC

# BAPUREDDY GEYALU

By J. BAPUREDDY

PRICE Rs. 5/-

SUKHELA PUBLICATION
I. C. 85, Irrammanzil Colony,
HYDERABAD-4.

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA101B104 |
| పుస్తకం పేరు | బాపురెడ్డి గేయాలు |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 183 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | CT, 1, 2, 6, BCT |
| లేని పేజీలు | no |
| తయారు చేసినది | Jayalakshmi |
| పేజీలు విడదీసినది | Jayalakshmi |
| స్కాన్ చేసినది | Nandini |
| పరీక్ష చేసినది | MADHU MATHI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| సంస్థితి | good |